# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com






సంపుటి:01 | సంచిక:18 | ఆదివారం | నవంబర్ 24, 2024 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు :10 | వెల:రూ 5/-

published from Kadapa, Vijayawada, Ananthapuramu, Circulated at AndhraPradesh & Telangana


## మహారాష్ట్రలో మహాయుతి..ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి గెలుపు



న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం సొంతం చేసుకుంది. మహారాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం 288 స్థానాల్లో 230కి పైగా స్థానాల్లో విజయం సాధించి.. రాష్ట్రంలో తన అధికారాన్ని నిలుపుకుంది. అయితే ప్రస్తుత మహారాష్ట్రలో తదుపరి సీఎం ఎవరనే దానిపై చర్చ సాగుతుంది. మహారాష్ట్రలో ప్రస్తుతం అధికార మహాయుతి కూటమి తరపున శివసేన (షిండే) నేత ఏక్‌నాథ్ షిండే సీఎంగా ఉన్నారు. అయితే మరోసారి ఆయన సీఎంగా కొనసాగుతారా?, ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినందున.. మహాయుతి నుంచి కొత్త సీఎం ఎంపిక ఉంటుందా? అనే చర్చ సాగుతుంది. మహారాష్ట్రలో అధికార ఏర్పాటుకు 145 మంది ఎమ్మెల్యేలు అవసరం కాగా.. బీజేపీ సింగిల్‌గానే 130కి పైగా స్థానాలను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి బీజేపీ నుంచే అవుతారని ప్రచారం జరుగుతుంది. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన దేవేంద్ర ఫడ్నవీస్ మరోసారి ఆ రాష్ట్ర అత్యున్నత పదవిని చేపట్టనున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.అయితే మహాయుతి కూటమి అధికారం కైవసం చేసుకోవడంలో తెర వెనక ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా కృషిచేసిందనే వాదన వినిపిస్తుంది. రాష్ట్రంలో బీజేపీకి విజయం ఖాయమైన కాసేపటికే.. దేవేంద్ర ఫడ్నవీస్ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఫోన్ చేసి వారి మద్దతుకు ధన్యవాదాలు తెలిపినట్లు సంబంధిత వర్గాలు టైమ్స్ నౌకు తెలిపాయి. మహారాష్ట్ర సీఎం పదవికి ఫడ్నవీస్‌కు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఇస్తుందని భావిస్తున్నట్టుగా ఆ వర్గాలు పేర్కొన్నాయి. విదర్భ, మరాఠవాడలలో మహాయుతి కూటమి



మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడంలో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు గణనీ యంగా పనిచేసిందని.. ఈ ప్రాంతంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పేలవంగా రాణించిందని ఆ వర్గాలు తెలిపా యి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా యుతి కూటమి విషయానికి వస్తే.. 149 నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో నిలుపగా, శివసేన (ఏక్‌నాథ్ షిండే) 81 స్థానాల్లో, ఎన్‌సీపీ(అజిత్ పవార్) 59 స్థానాల్లో అభ్యర్థులను నిలిపారు. ఫలితాల పరంగా బీజేపీ సత్తా చాటిందనే చెప్పాలి. ఏకంగా 130కి పైగా స్థానాలను కైవసం చేసుకోనుంది. శివసేన (ఏక్‌నాథ్ షిండే) 57 చోట్ల, ఎన్‌సీపీ(అజిత్ పవార్) 41 చోట్ల విజయం దిశగా సాగుతున్నారు. దీంతో బీజేపీ అతిపెద్ద పార్టీగా నిలవడమే కాకుండా..

## మహారాష్ట్రలో మహాయుతి కూటమి చారిత్రక విజయం సాధించింది: చంద్రబాబు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీలతో కూడిన మహాయుతి కూటమి (ఎన్డీయే) ప్రభంజనం సృష్టించింది. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 స్థానాలు ఉండగా... మహాయుతి కూటమి 222 స్థానాల్లో ముందంజలో ఉంది. విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి 53 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మిగిలిన స్థానాల్లో ఇతరుల ఆధిక్యం కొనసాగుతోంది.ఈ క్రమంలో, మహారాష్ట్ర ఎన్నికలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మహారాష్ట్రలో చారిత్రక విజయం సాధించిన మహాయుతి కూటమికి శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం కొనసాగుతోందని చెప్పడానికి ఈ విజయమే నిదర్శనమని పేర్కొన్నారు. వ్యూహాత్మక దార్శనికత, గుణాత్మక మార్పు దిశగా ప్రభుత్వ విధానాలు, ప్రజల పట్ల ప్రేమాభిమానాలతో వికసిత్ భారత్ కు బాటలు పరుస్తున్న మోదీని ప్రజలు మరోసారి విశ్వసించారని చంద్రబాబు వివరించారు.

## కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కసరత్తు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రేషన్ కార్డు లేని పేదలకు కొత్తగా రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టింది. డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు కీలకం కావడంతో.. లక్షలాదిమంది కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నా కార్డులు రానివారు కూడా కొత్త కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ మేరకు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి వరకూ చేసుకున్న దరఖాస్తులను కూడా పరిగణనలోనికి తీసుకుని..అన్నింటినీ పరిశీలించి అర్హులకు రేషన్ కార్డుల్ని అందజేయనున్నారు.

మిగతా 2లో

**మహాయుతి కూటమి విజయం.. హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ** 2

**నా గెలుపు మీ విజయమే: ప్రియాంకాగాంధీ** 2

**అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం... ఏడుగురి మృతి**

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి** 2

రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం

**మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఊహించలేదు: రాహుల్ గాంధీ** 2

**బంగాళాఖాతంలో అల్పపీడనం... ఏపీలో మళ్లీ వర్షాలు** 2




ప్రజాభూమి

## ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరించాలి: పవన్ కల్యాణ్

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-
డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ తనకు వస్తున్న వివిధ ఫిర్యాదులపై ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలతో పాటు ప్రైవేటు భూముల ఆక్రమణలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులపై అన్ని జిల్లాల కలెక్టర్లు మరియు కాకినాడ పోలీసులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరించాలని పవన్ సూచించారు. ఫిర్యాదులపై ప్రాధాన్యతను ఇస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని చెప్పారు. ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి తమ ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేయడం, రాష్ట్ర వనరులను రక్షించడంలో, నేరస్థులను బాధ్యులను చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ రాసుకొచ్చారు.

## అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం... ఏడుగురి మృతి

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
ఇద్దరు ఘటన స్థలంలోనే దుర్మరణం
మరో ఐదుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
మృతులంతా ఒకే గ్రామానికి చెందినవారు

ప్రజాభూమిప్రతినిధి,అనంతపురం:-
అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్ద ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీలు పొలం పనులు ముగించుకుని ఆటోలో ఇళ్లకు వెళు తుండగా... ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఘటన స్థలంలో ఇద్దరు దుర్మరణం చెందగా... ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఐదుగురు మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా, మృతులను తాతయ్య (55), రామాంజనమ్మ (48), చిన నాగమ్మ (48), పెద నాగమ్మ (60), జయరాముడు, చిన నాగన్న, కొండమ్మగా గుర్తించారు. మృతులంతా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందినవారు. ఒకేసారి ఏడుగురు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఎల్లుట్ల గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గార్లదిన్నె మండలం కలగాసుపల్లె వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృత్యువాత పడటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చిన సీఎం... ఒక్కో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## మహారాష్ట్రలో మహాయుతి.. ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి గెలుపు

మొదటిపేజీ తరువాయి
ఆ పార్టీ స్ట్రైక్ రేట్ కూడా మిగిలిన పార్టీల కంటే అధికంగా ఉంది. దీంతో ఆ పార్టీ నుంచే సీఎం ఉంటారనే ప్రచారం సాగుతుంది. మరోవైపు షిండే వర్గీయులు కూడా తమ నేత సీఎంగా కొనసాగుతారనే ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగియనుంది. అప్పటిలోగా అక్కడ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టుగా తెలుస్తోంది. మహాయుతి విజయం తర్వాత ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌లు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారని అన్నారు. సీఎం అంటే సామాన్యుడేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం సామాన్యుడిని సూపర్‌మ్యాన్‌గా మార్చాలని చూస్తోందని అన్నారు. ద్వేషం, ప్రతీకార రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని.. సంక్షేమం, అభివృద్ధి రాజకీయాలను ప్రజలు అంగీకరించారని పేర్కొన్నారు.

అయితే ఫడ్నవీస్ మరో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో ఎలాంటి వివాదాలు ఉండదని.. ఎన్నికల తర్వాత మూడు పార్టీల నేతలు కలిసి కూర్చొని నిర్ణయం తీసుకోవాలని తొలి రోజే నిర్ణయించామని చెప్పారు. నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని.. దీనిపై ఎటువంటి వివాదం ఉండదని అన్నారు.ఇక, 2014 అక్టోబర్ నుంచి 2019 నవంబర్ వరకు దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ తిరిగి సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. అప్పుడు చోటుచేసుకున్న పరిణామాలతో నాలుగైదు రోజుల్లోనే ఆ పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఇక, ఆ తర్వాత రెండున్నరేళ్లకు మహా రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. శివసేనలో తిరుబాటు తర్వాత ఏక్ నాథ్ షిండే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా.. ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం అయ్యారు.

**వయనాడ్‌లో ప్రియాంక గాంధీ జయభేరి**

తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఘన విజయం సాధించారు. కేరళ వయనాడ్ లోక్ సభ ఉప ఎన్నికలో ఆమె భారీ విజయాన్ని అందుకున్నారు. బీజేపీ నేత, సమీప అభ్యర్థి నవ్య హరిదాస్‌పై 3.94 లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో చారిత్రాత్మక విజయాన్ని అందుకున్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన 3.64 లక్షల ఓట్ల మెజార్టీని ప్రియాంక దాటేసి రికార్డు సృష్టించారు. రెండో స్థానంలో కమ్యూనిస్టు అభ్యర్థి సత్యన్ మోకరి నిలిచారు.

బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ 10 వేల ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. 'అభివృద్ధి గురించి ఆలోచించి ప్రజలు ఓటేస్తారని భావించాను. కానీ, పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది.' అని బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ అన్నారు.కాగా, వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3 లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్ సభ ఎన్నికల్లో వయనాడ్ స్థానం నుంచి పోటీ చేసిన రాహుల్.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.64 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయ్‌బరేలీలోనూ విజయం సాధించడంతో ఆ తర్వాత ఆ స్థానాన్ని వదులుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ప్రియాంక గాంధీ రంగంలోకి దిగారు. ఝార్ఖండ్ తొలి విడత ఎన్నికలతో పాటుగా ఈ నెల 13న ఇక్కడ పోలింగ్ జరిగింది.

**స్పందించిన రాబర్ట్ వాద్రా**

ప్రియాంక గాంధీ విజయంపై ఆమె భర్త రాబర్ట్ వాద్రా స్పందించారు. 'ప్రియాంక కృషిని గుర్తించిన వయనాడ్ ప్రజలకు ముందుగా ధన్యవాదాలు. ఆమె కచ్చితంగా భారీ మెజార్టీతో విజయం సాధిస్తారు.

ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించేందుకు శ్రమిస్తారు. దేశ ప్రజలకు సేవ చేయాలనే ఆకాంక్ష, ఆశయంతోనే ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. రికార్డు విజయం సాధించడంపై అభినందనలు.' అని రాబర్ట్ వాద్రా పేర్కొన్నారు. అటు, మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాల సరళిపైనా ఆయన స్పందించారు.

'మహారాష్ట్ర ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ప్రజల తీర్పును గౌరవించాలి. గెలిచిన పార్టీతో కలిసి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలి. ఝార్ఖండ్ ఫలితాలపై సంతోషంగా ఉంది.

ఈడీ, ఇతర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి అధికార పార్టీకి బీజేపీ ఇబ్బందులు కలిగించింది. అయినా ప్రజలు సరైన నిర్ణయం తీసుకున్నారు.' అని పేర్కొన్నారు. రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడంపై స్పందించిన వాద్రా.. ప్రజల కోసం తాను నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని చెప్పారు. అలాంటప్పుడు పార్లమెంట్‌లోనే ఉండాల్సిన అవసరం లేదన్నారు. ప్రియాంక పార్లమెంట్‌లో ప్రజల గళాన్ని వినిపించనున్నారని.. తనకూ అలాంటి సమయం రావొచ్చని చెప్పారు. ప్రజలు ఏం కోరుకుంటారో అదే జరుగుతుందని పేర్కొన్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఊహించలేదు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ:మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదని లోక్ సభ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ కూటమి మహాయుతి 232 సీట్లు, కాంగ్రెస్ తో కూడిన ఎంవీఏ కూటమి 52 సీట్లు గెలుచుకుంది. మహారాష్ట్రలో దారుణ పరాభవంపై రాహుల్ గాంధీ స్పందించారు. మహారాష్ట్ర ఫలితాలను విశ్లేషిస్తామని పేర్కొన్నారు.ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాలపైనా రాహుల్ గాంధీ స్పందించారు. ఇండియా కూటమికి ఇంతటి మెజార్టీ ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. విజయం సాధించినందుకు గాను సీఎం హేమంత్ సోరెన్, పార్టీ కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ విజయం రాజ్యాంగంతో పాటు నీరు, అటవీ, భూపరిరక్షణ విజయం అన్నారు.
వయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలుపుపై రాహుల్ గాంధీ స్పందిస్తూ... తన కుటుంబం, ప్రియాంకపై వయనాడ్ ప్రజలు నమ్మకం ఉంచారని, ఇందుకు తాను గర్విస్తున్నానన్నారు. వయనాడ్ సర్వతోముఖాభివృద్ధికి ప్రియాంక పాటు పడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## నా గెలుపు మీ విజయమే: ప్రియాంకాగాంధీ

వయనాడ్ లో 4 లక్షలకు పైగా మెజార్టీతో గెలుపొందిన ప్రియాంక
వయనాడ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన ప్రియాంక
పార్లమెంట్ లో వయనాడ్ గొంతుకనవుతానని వ్యాఖ్య



న్యూఢిల్లీ:కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ తన తొలి ఎన్నికల సమరంలోనే ఘన విజయాన్ని అందుకున్నారు. వయనాడ్ లోక్ సభ ఉపఎన్నికలో 4,08,036 ఓట్ల మెజార్టీతో ఆమె అద్భుత విజయాన్ని సాధించారు. తన విజయంపై ప్రియాంక స్పందిస్తూ... వయనాడ్ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మీరు నాపై ఉంచిన నమ్మకానికి ఎంతో సంతోషిస్తున్నానని చెప్పారు. ఈ విజయం మీదేనని అన్నారు. పార్లమెంట్ లో మీ గొంతుకనవుతానని... వయనాడ్ గళం వినిపించేందుకు ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. మరోవైపు సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో, సోమవారమే ఎంపీగా ప్రియాంకాగాంధీ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. తన సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి లోక్ సభలోకి ప్రవేశించి... ఎంపీగా ఆమె ప్రమాణస్వీకారం చేయనున్నట్టు సమాచారం. గాంధీ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు పార్లమెంట్ ఉభయ సభల్లో ఉండటం గమనార్హం. ఇప్పటికే రాహుల్ గాంధీ లోక్ సభలో, సోనియాగాంధీ రాజ్యసభలో సభ్యులుగా ఉన్నారు. ఇప్పుడు ప్రియాంక లోక్ సభలోకి అడుగుపెట్టబోతున్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం... ఏపీలో మళ్లీ వర్షాలు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-
తూర్పు హిందూ మహాసముద్రాన్ని ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ... దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఈ నెల 25న వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. అనంతరం... వాయవ్య దిశగా కదులుతూ తమిళనాడు, శ్రీలంక తీరాలకు చేరువగా వెళుతుందని వివరించింది. దీని ప్రభావంతో ఏపీలో వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీఎస్డీఎంఏ వివరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కసరత్తు

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రంలో సంక్రాంతి కానుకగా రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాదు.. ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల స్థానంలో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసే పనిలో ఉంది.. దీనిని త్వరగా పూర్తి చేసి కొత్త కార్డులన్నీ ముద్రించి పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డుల్లో వైఎస్ జగన్ ఫోటో ఉంది.. వాటిని పూర్తిగా మార్చనున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రిస్తారు. కొత్త టెక్నాలజీని జోడించి.. లబ్ధిదారులకు ఉచితంగా అందించనుంది ప్రభుత్వం. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు.. కొత్తగా పెళ్లయిన వారికి కార్డులు జారీ చేయనున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న వారికి కార్డులు ఇవ్వాలంటే.. అప్పటికే వారి కుటుంబానికి ఉన్న రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించాల్సిందే. ఈ కారణంతో కొత్తగా పెళ్లైన వారిలో కొందరికి కార్డులు అందలేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివాహ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా కొత్త జంటకు రేషన్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారు, ఒంటరిగా ఉన్న వారికీ రేషన్ కార్డులు ఇస్తారు. అంతేకాదు గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు రేషన్ కార్డులు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి.. అర్హులకు కార్డులు నిరాకరించినట్లు చెబుతున్నారు. అందుకే ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలించి.. అర్హులందరికీ కార్డులు ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. అందుకే గ్రామసభలు కూడా నిర్వహించనున్నారు. కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకునే వారు డిసెంబరు 2 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు అధికారులు. డిసెంబర్ 28 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని..జనవరి 1 నుంచి మార్చి వరకు పరిశీలించి, అర్హులైన వారికి కార్డులు అందిస్తామంటున్నారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డుల్ని అందజేయనున్నారు.

## మహాయుతి కూటమి విజయం.. హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ:మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 స్థానాలు ఉండగా... మ్యాజిక్ ఫిగర్ 145. మ్యాజిక్ ఫిగర్ ను ఎప్పుడో దాటేసిన మహాయుతి కూటమి (బీజేపీ-శివసేన షిండే వర్గం, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం) 232 స్థానాల్లో విజయం ఖాయం చేసుకుంది. విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి 52 స్థానాల్లో ముందంజ వేసింది. ఈ నేపథ్యంలో, మహాయుతి కూటమి విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర ఓటర్లు, మహిళలు, యువతకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని వెల్లడించారు.ఐక్యంగా ఉండడం వల్ల మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర అభ్యున్నతికి మహాయుతి కూటమి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.ఇక, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపైనా ప్రధాని స్పందించారు. ఝార్ఖండ్ లో అధికార జేఎంఎం కూటమి విజయం సాధించినందుకు అభినందనలు అంటూ ట్వీట్ చేశారు. అయితే, విపక్షంగా ప్రజల సమస్యలను లేవనెత్తడంలో, రాష్ట్రం కోసం పనిచేయడంలో ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు.

## వైసీపీకి మరో షాక్ - పార్టీకి, పదవికి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా !

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది.ఆ పార్టీకి , ఎమ్మెల్సీ పదవికి జయమంగళ వెంకటరమణ రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీకి చేసిన రాజీనామా లేఖను జగన్‌కు..ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా లేఖను శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజుకు పంపించారు. తన రాజీనామాలను ఆమోదించాలని ఆయన లేఖల్లో కోరారు.ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కైకలూరు నియోజకవర్గానికిచెందిన జయమంగళ వెంకటరమణ మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. ఓ సారి ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి ఓడిపోయారు. ఓ సారి పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయిస్తే పని చేశారు. టీడీపీ ఓడిపోయిన తర్వాత మళ్లీ ఆయనకు కైకలూరు ఇంచార్జ్ పదవి ఇచ్చారు. ఆయనకే అక్కడ టిక్కెట్ వస్తుందని అనుకున్నారు. అయితే పొత్తులు కుదిరితే తనకు సీటు ఉండనది ఆయన ఫీలయ్యారు. అదే సమయంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాల్సిన జగన్ దృష్టిలో పడ్డారు. బీసీ మత్స్యకార వర్గానికి చెందిన జయమంగళ వెంకటరమణ వల్ల ఉపయోగం ఉంటుందని ఆయనకు ఎమ్మెల్సీ ఆఫర్ చేసి పార్టీలోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్సెల్సీగా అవకాశం ఇచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీగా ఆయన ఇటీవల శాసనమండలి సమావేశాలకు కూడా హాజయ్యారు. అయితే వైసీపీ ఘోరపరాజయం పాలైనప్పటి నుండి ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. చివరికి పాత పార్టీ టీడీపీతో టచ్ లోకి వెళ్లారని చెబుతున్నారు. తిరిగి పార్టీకి రావాలంటే పదవికి కూడా రాజీనామా చేయాలని షరతు విధించడంతో ఆ మేరకు పదవికి కూడా రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది.

ఆయనకు ఇంకా ఐదేళ్లకుపైగా పదవీ కాలం ఉంది. ఇటీవలి కాలంలో వైసీపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీల్లో జయమంగళ వెంకటరమణ నాలుగోవారు. ప్రస్తుతం పోతుల సునీత, బల్లి కల్యాణ్ చక్రవర్తి, సుంకర పద్మశ్రీలు ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి రాజీనామాలు చేశారు. కానీ వారి రాజీనామాలు చేశారు. మండలి చైర్మన్ ఆమోదించలేదు. తమ రాజీనామాలు ఆమోదించాలని వారు పదే పదే శాసనమండలి చైర్మన్ ను కోరుతున్నా నిర్ణయం తీసుకోవడం లేదు వైసీపీ తరపున ఎవరు రాజీనామా చేసినా మళ్లీ ఆ పదవి వైసీపీకి వచ్చే అవకాశం లేదు. ఒక వేళ తాము చేరబోయే పార్టీ అంగీకరిస్తే రాజీనామా చేస్తున్న ఎమ్మెల్సీ పదవులు వారికే వస్తాయి. లేకపోతే మరో పదవి కోసం వేచి చూడాల్సిందే.అధికార పార్టీలో ఒక సంవత్సరం ఎమ్మెల్సీగా ఉండి కూడా ప్రజలకు ఏమి సేవ చేయలేకపోయానని జయమంగళ వెంకటరమణ అంటున్నారు.

కనీసం పోలీసులకి ఫోన్ చేయాలన్న స్వతంత్రం లేదని పదవి అయితే ఇచ్చారు గాని పవర్ ఇవ్వలేదన్నారు. 23 సంవత్సరాలు టిడిపిలో ఉండి కొల్లేరు ప్రజల కోసం వైసీపీలోకి వచ్చాను వైసీపీలో కూడా ఏమీ చేయలేకపోయానన్నారు. ఏదైనా సమస్య కోసం వైసీపీ ప్రభుత్వాని కోరితే సజ్జలతో మాట్లాడు ధనుంజయ గారితో మాట్లాడు అనడమే తప్ప ఏ పని జరగలేదన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేగా కొల్లేరు ప్రజలకి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని.. .ఏ పార్టీలోకి వెళ్ళేది నా ప్రజలతో మా నాయకులతో సంప్రదించి భవిష్యత్తు కార్యాచరణ తెలుపుతానన్నారు. సమస్యల గురించి మాట్లాడదామని వెళితే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అపాయింట్మెంట్ ఇవ్వలేదుని ఆరోపించారు.

ప్రజాభూమి

## రూల్ ఆఫ్ రిజర్వేషన్ విద్యా సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు వడిత్యా సోమ శంకర్ నాయక్

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా సోమ శంకర్ నాయక్ జెఎన్టియుకె కాకినాడ యూనివర్శిటీ ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్. మురళీకృష్ణ మరియు అధికారులతో శనివారం సాయంత్రం విసి కాన్ఫరెన్స్ హాలు నందు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మరియు విద్యా సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. యూనివర్శిటీలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వడిత్యా సోమ శంకర్ నాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మరియు క్యాంపస్ కళాశాలల్లోను రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అధ్యాపకులకు, సిబ్బందికి, విద్యార్థులకు పదోన్నతులలోను, విద్యాపరంగాను మరియు మౌలిక సదుపాయాలను నిబంధనలను అనుసరించి కల్పించాలన్నారు. మానవ సేవే మాధవసేవ అని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను తొందరలో భర్తీ చేయాలన్నారు.ఎస్టీ %ఊ% ఎస్సీ సెల్ లైజనింగ్ ఆఫీసర్ ఎం. కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్ జి. మురళీకృష్ణతో పాటు ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి. రవీంద్రనాథ్, ఓఎస్డి ప్రొ.డి. కోటేశ్వరరావు, డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

### మొండి బకాయిలపై చర్యలు చేపట్టాలి

### రెవెన్యూ విభాగ అధికారులు, సిబ్బందితో నగరపాలక సంస్థ కమిషనర్ భావన

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ




ఇంటి, కుళాయి పన్నుల వసూలుపై రెవెన్యూ విభాగా ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భావన రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ భావన మాట్లాడుతూ 50 శాతం మేర ఉన్న పన్నుల బకాయి భారాన్ని తగ్గించాల్సిన బాధ్యత రెవెన్యు ఇన్స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పై ఉందన్నారు. పన్నులు చెల్లించని వారికి తక్షణమే నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలన్నారు.మంచి నీటి కుళాయి పన్ను బకాయిలు రూ.16 కోట్లు, ఇంటి పన్నుల బకాయిలు రూ.25 కోట్ల వరకు పెండింగ్లో ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన వసూలు చేసి నూరుశాతం వసూలు చూపించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పన్నుల వసూలుపై వారంవారం సమీక్ష నిర్వహిస్తానని మెరుగుదల కనిపించాలని కమిషనర్ భావన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.టిసుధాకర్ , డిప్యూటీ కమిషనర్ ఎస్.మనోహర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## భారత నావికాదళం సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు

### వి ఆర్ ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మావూరి తిరుపతి రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ



పీ ఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మావూరి తిరుపతి రెడ్డి అధ్యక్షతన భారత నావికదళం సిబ్బంది అవగాహనా సదస్సు నిర్వహించారు. డిసెంబర్ 4 వ తేదీన నావికా దినోత్సవంవిద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు నేవీలో జాయిన్ అవ్వవలసిన ఆవశ్యకతను వివరించారు. దేశానికి నౌకా దళాల విజయాలు, దేశ రక్షణలో వారి పాత్రను గుర్తు చేసుకొవటానికి జరుపుకుంటారు. 1971 ఇండియా – పాకిస్థాన్ యుద్ధంలో నావీ పాత్ర ,భారతదేశ నావికా దళం జలాంతర్గామి , ఉపరితల ,సహాయ నౌకాదళం గా దేశానికి ఏ విధంగా సేవ చేస్తున్నాయో వివరించారు. ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ భారత రక్షణ వ్యవస్థలో భాగమయిన భారత నావికా దళం ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద నావికా దళం. కేవలం దేశరక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుందనీ , విద్యార్థులకు అవగాహన కోసమే జాతీయ సేవా పథకం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారనీ చెప్పారు . ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు పిల్లి.వి. శివ ప్రసాద్, నిరంజన్ కుమార్, కళాశాల అధ్యాపక , అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సి పి ఆర్ చేసి ప్రాణం కాపాడిన అంబులెన్స్ డ్రైవర్ కు సన్మానం

ప్రజాభూమి, వి.ఆర్.పురం



మండలంలోని రేఖపల్లి గ్రామానికి చెందిన టి డి పి నాయకులు మామిడి రాజు కారులో ప్రయాణిస్తున్న సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి చేరుకోగానే స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. కొత్తగూడెం వి కేర్ ఆస్పత్రిలో వెంటిలేటర్ సహాయం తో చికిత్స అందించినప్పటికి పరిస్థితి విషమించడంతో భద్రాచలం లోని వెంటిలేటర్ సదుపాయం కలిగిన మహిశ్రీ అంబులెన్స్ లో ఖమ్మం లోని ఆరోగ్య హాస్పిటల్ కి సుమారు రాత్రి 2 గంటల సమయం లో తీసుకెళ్ళారు. అక్కడ నైట్ డ్యూటీ లో వున్న మహిళా డాక్టర్ అంబులెన్స్ వద్దకు వచ్చి పరీక్షించి మరణించినట్లు గా ధ్రువీకరించి వెళ్ళిపొమ్మని చెప్పారు. అనంతరం డిక్లరేషన్ ధ్రువ పత్రం కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్ళే సమయంలో అంబులెన్స్ డ్రైవర్ సి పి ఆర్ చేయగా ప్రభుత్వ ఆసుపత్రి నైట్ డ్యూటీ డాక్టర్ ప్రాణం వున్నట్లు నిర్ధారించారు. అక్కడ వెంటిలేటర్స్ ఖాళీ లేనందువల్ల దగ్గరలోని స్థంభాద్రి హాస్పిటల్ కి వెళ్ళగా కార్డియాలజిస్టు డాక్టర్ హర్ష గారు అత్యవసర చికిత్స అందించి తిరిగి 12 గంటల లోపు కళ్ళు తెరవడం 24 గంటల లోపు స్పృహలోకి వచ్చేలా చేశారు. మామిడి రాజు ప్రాణం కాపాడిన అంబులెన్స్ డ్రైవర్ కట్టప్ప స్వామిని, ఆయన సతీమణి నర్సింగ్ టెక్నీషియన్ నవ్యశ్రీ ని మామిడి రాజు కుటుంబ సభ్యులు శనివారం మామిడి రాజు ఇంటివద్ద ఘనంగా సన్మానించి, నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రాజు కుటుంబ సభ్యులు బంధువులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జాతి సమైక్యత లక్ష్యంగా రేపు ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజల వన సమారాధన

### ఆహ్వానం పలికిన మంత్రి సుభాష్, సంఘ నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి అమలాపురం



శెట్టి బలిజ జాతి సమైక్యత నినాదంతో అమలాపురంలో రేపు అనగా ఆదివారం( 24-11-2024 )న జరిగే శెట్టిబలిజ కార్తీక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనం ను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనంకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి సుభాష్, మరియు వారి తండ్రి వాసంశెట్టి సత్యం, ఇతర సంఘ నాయకులతో పరిశీలించారు. అనంతరం జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సంఘ నాయకులతో కలిసి మంత్రి సుభాష్ మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి శుభాష్ మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలో ఈ వన సమారాధన నిర్వహిస్తున్నామని, ఇదే మా ఆహ్వానంగా భావించి ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన శెట్టి బలిజ నాయకులు, ప్రజలు ఆత్మీయ సమ్మేళనంకు హాజరుకావాలని కోరారు. ఏడాదికి ఒకసారి నిర్వహించుకునే ఈ ఆత్మీయ సమ్మేళనానికి శెట్టిబలిజలు కుటుంబ సమేత సపరివారంగా హాజరుకావాలని పిలుపు నిచ్చారు. 2022 సంవత్సరంలో నిర్వహించిన వన సమారాధనకు 50 వేల మంది పైగా హాజరుకాగా, 2023 సంవత్సరంలో సుమారు లక్ష 20 వేల మంది హాజరయ్యారన్నారు. వీరిలో సుమారు 60 వేల మంది మహిళలు హాజరు కావడం విశేషం అన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే ఈ కార్యక్రమానికి జాతి ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఆత్మీయ కలయిక సంఘ నాయకుల్లో, ప్రజల్లో ఐకమత్యం, స్నేహం, సాన్నిహిత్యం, ఆత్మవిశ్వాసం, మనో నిబ్బరంతో ముందుకు సాగేందుకు దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, శాంతియుతంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, అలాగే బైకుల సైలెన్సర్లు తీసి వాహనాల నడపకూడదని మంత్రి సుభాష్ విజ్ఞప్తి చేశారు. తమ జాతి ఐక్యతను చాటుతూనే ఇతర కులాలను గౌరవించడం మా బాధ్యత అన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, ఇందుకు సహకరిస్తున్న పోలీసు అధికారులకు, మీడియా ప్రతినిధులకు, ప్రజలకు మంత్రి సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు, సంఘ నాయకులు, మంత్రి సుభాస్ తండ్రి వాసంశెట్టి సత్యం, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పెచ్చెట్టి చంద్రమౌళి, వాసంశెట్టి చినబాబు, మట్టపర్తి నాగేంద్ర, కుడిపూడి త్రినాధ రావు, చొల్లంగి వెంకటరమణ, బొంతు గంగాధరం, గుత్తుల నాగేశ్వరరావు తదితర సంఘ నాయకులు పాల్గొని ఆహ్వానం పలికారు.

## సంపదలో రాజ్యాధికారం లో వాటా కోసం పోరాడాలి: సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిజెవి సత్యనారాయణమూర్తి.

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ



దేశ సంపద సృష్టికర్తలమైన మనం ఉచిత పథకాల కోసం పాకులాడకుండా సంపదలో రాజ్యాధికారంలోన్యాయమైన వాటా కోసం పోరాడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. శ్రామికులు శ్రమిస్తేనే సంపద పుడుతుందని, అంబానీ, ఆదానీలు సంపద సృష్టికర్తలు కాదన్నారు. "కులగణన–సామాజిక న్యాయం"అనే అంశంపై అంబేద్కర్ భవన్లో శనివారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాలకవర్గాలు అధికారం కోసం మోసాలు చేస్తూనే ఉన్నారన్నారు. మన నోరు మూయించడానికే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మనకు రావాల్సిన వాటాను పొందడం మన హక్కుగా భావించాలన్నారు. మనం సృష్టిస్తున్న సంపదలో 60 శాతం సంపన్న వర్గాలకే వెళ్ళిపోతుదంన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు కల్పించారని ,ఆయన ఆశయాలను మనం సాధించలేకపోతున్నామన్నారు. ముఖ్యంగా యువత చైతన్యవంతులై హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు . బ్రిటిష్ కాలంలోనే కులగణన జరిగిందని, వారి పరిపాలన సౌలభ్యం కోసం, దేశ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి కులగణన చేపట్టారన్నారు. బ్రిటిష్ వారు అగ్రవర్ణాలకు ఆగ్రహం కలిగించకుండా పరిపాలన సాగించారన్నారు. భారతదేశంలో ఉన్నన్ని అసమానతలు ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. అందరికీ సమానమైన హక్కులు లేవని, హక్కులను పరిమితం చేశారన్నారు. దళితులు ఇప్పటికీ వివక్షకు గురవుతూనే ఉన్నారు అన్నారు. క్లాస్ -4 ఉద్యోగాలకే ఎస్సీ ఎస్టీలు పరిమితం అవుతున్నారని, ఉన్న స్థాయి ఉద్యోగాలు పొందలేకపోతున్నారన్నారు. పెద్ద పెద్ద పొడవైన విగ్రహాలు పెట్టి సామాజిక న్యాయం చేస్తున్నామని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. సిపిఎం నాయకులు, కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ

కులగణన వల్ల సామాజిక న్యాయం జరిగింది లేనిది తెలుసుకోవచ్చని, ఆర్థికంగా బలపడింది లేనిది కూడా తెలుస్తుంది అన్నారు. ప్రభుత్వ పాలనలో నష్టపోయిందెవరు, బాగుపడింది ఎవరో కూడా తేలుతుంది అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ కులగణనను వ్యతిరేకిస్తున్నాయని, దీనివల్ల వివాదాలు చలరేగుతాయని చెప్పడం ఆస్యాస్పదంగా ఉందన్నారు. మన ధర్మాన్ని బ్రాహ్మణ భావజాలం కొనసాగాలని బిజెపి కోరుకుంటుందన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేయడం పెద్ద కుట్రని,ప్రజల జీవన స్థితిగతులు ఇంకా దిగజారే విధంగా పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. యువత మరింత చైతన్యవంతులై పాలకుల విధానాన్ని ఎండగట్టాలున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగమే మనకు అన్ని విధాల రక్షణ కల్పిస్తుందని, బిజెపి పాలనలో రాజకీయ విధ్వంసం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన రావాల్సిన వాటా మనకు దక్కట్లేదన్నారు. కుల వివక్ష అసమానతలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ మనకు అనేక హక్కులు కల్పించారని వాటిని కాపాడుకోవాలని అన్నారు. రిజర్వేషన్ లేకపోతే మన పరిస్థితి మరి దారుణంగా ఉండేది అన్నారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు బి కళ్యాణ్ రావు మాట్లాడుతూ కలిసికట్టుగా పోరాడాలి అన్నారు. అన్ని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలు రాజకీయ లబ్ధి కోసమే అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకర్ మాట్లాడుతూ కుల గణన జరగాలన్నారు. దళితుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. డీహెచ్పిస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి జి రాంబాబు, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, టీ కాంతారావు తదితరులు పాల్గొన్నారు

## స్వగృహానికి చేరుకున్న గారా కుమారి

ప్రజా భూమి గండేపల్లి.



బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురైన గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన గారా కుమారి అనే మహిళను రాష్ట్ర ప్రభుత్వ చొరవతో శుక్రవారం సురక్షితంగా తిరిగి స్వదేశానికి వచ్చింది.భర్త మరణానంతరం ఇల్లు గడవడం కష్టమైన పరిస్థితుల్లో తన ముగ్గురు పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం ఈమె పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు కు చెందిన ఏజెంట్ యం సుధాకర్ ద్వారా గత మే నెల 1వ తేదీన ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లింది. కువైట్ దేశంలో 30 వేల జీతంతో ఇంటి పనులు చేసేందుకు ఉద్యోగంలో చేరింది.అయితే తాను పనిచేసే యజమాని తీవ్ర ఇబ్బందులకు, చిత్రహింసలకు గురిచేయడంతో నరక యాతనకు లోనైంది.ఉపాధి కోసం వెళ్లి విదేశాలలో నానా యాతనలు పడుతున్న వారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదుకుంటున్న విషయాన్ని తెలుసుకొని, దేశం కాని దేశంలో తాను పడుతున్న అవస్థలను వీడియోగా చిత్రీకరించి,తన సోదరుడు కర్రిపోతు సూర్యచంద్ర ద్వారా వారికి వీడియో పంపింది. హృదయ విదారకమైన ఆమె దీన పరిస్థితికి చలించిన మంత్రులు ఇరువురు కువైట్ లోని భారత రాయభార కార్యాలయంతో చర్చించి ఆమె తిరిగి స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసారు.ఇరువురి చొరవతో గారా కుమారి కువైట్ నుండి విమానంలో హైదరాబాదు చేరుకుని, శనివారం తెల్లవారుజామున తన స్వగ్రామమైన గండేపల్లి మండలం యల్లమిల్లి లోని తన ఇంటికి చేరుకుంది.ఆమె రాక తో ఎదురు చూస్తున్న పిల్లలు, కుటుంబ సభ్యులు పొందిన ఆనందానికి అవధులు లేవు. కష్టాల చీకటిలో కొట్టాడుతున్న తమ కుటుంబానికి కొండంత అండగా నిలచి ఆదుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు గారా కుమారి ఆమె కుటుంబ సభ్యులు చేతులెత్తి నమస్కరిస్తూ వారికి సదా రుణపడి ఉంటామని తెలియజేశారు.అలాగే తాను తిరిగి స్వదేశానికి రావడానికి ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కి, జిల్లాయంత్రాంగానికి గారా కుమారి ధన్యవాదాలు తెలియజేశారు.

## అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీల సమస్యల పరిష్కారానికై పోరాడుదాం.

### - ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు

ప్రజాభూమి రంపచోడవరం.






భూమికోసం, భుక్తి కోసం,పీడిత ప్రజల విముక్తి కోసం అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ సభను రంపచోడవరం మండలం, వేములకొండ పంచాయతీ, సీమగండి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య,ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( విజృంభన ), ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి ) తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పి డి ఎస్ యు( వి) రాష్ట్ర నాయకులు కడితి సతీష్ అధ్యక్షత వహించగా ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్రకార్యదర్శి కర్నాకుల విరాంజనే యులు ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. సభలో ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ భూమి, భుక్తి,విముక్తి పోరాటాల్లో అనేకమంది మహనీయుల త్యాగం మరువలేనిదని కొనియాడారు. అనేక పోరాటాలు, త్యాగాలు ఫలితంగా ఆదివాసీలు హక్కులను నేటి పాలకవర్గాలు కాలరాస్తున్నయన్నారు.కెంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అడవిలో నుండి గెంటివేసే కుట్రలుచేస్తున్నాయన్నారు. గిరిజనులపై గిరిజనేతరుల పెత్తనం పెరిగిపోయిందని విమర్శించారు. ఆదివాసి గ్రామాల్లో ఆదివాసీలు సాగు చేసుకుంటున్నా బంజర్ భూములకు, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలనిడిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ మూడును పునరుద్ధరించాలని, 2006 అటవి హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, ఆదివాసీ ప్రాంతాల్లో పీసా చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలు తమ సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని అల్లూరి సీతారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్, అధ్యక్షులువల్లూరి రాజబాబు, ఏఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, ఏపీ ఆర్ సి ఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వర రావు, డి. సురేష్, వడ్డీ ఆనంద్, సీనియర్ ఉద్యమ నాయకులు జి. విశ్వనాథ్,, పిడిఎస్యు ( వి) జిల్లా కార్యదర్శి పి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# చిన్నంపేట లో ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలి

## సిఐటియు ఏలేశ్వరం మండల కార్యదర్శి రంగల ఈశ్వరరావు డిమాండ్




ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

నవంబర్ 16వ తేదీన అర్ధాంతరంగా మూసివేసిన ఏలేశ్వరం మండలం చిన్నంపేట జీడి పిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని సిఐటియు మండల కార్యదర్శి రంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మూతపడ్డ ఫ్యాక్టరీ ఎదుట గత 8 రోజులుగా ధర్నాలు నిర్వహిస్తున్న కార్మికులను కలిసి ఈశ్వరరావు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 409 మంది కార్మికులు పనిచేస్తున్న జీడిపిక్కలు ఫ్యాక్టరీని యాజమాన్యం అర్ధాంతరంగా మూసివేయటంతొ కార్మికులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఫ్యాక్టరీలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని చెబుతుండగా ఫ్యాక్టరీని మూసేసి 24 గ్రామాలకు చెందిన కార్మికుల పొట్ట కొట్టడం ఎంతవరకు సబబు ప్రశ్నించారు. ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించి వెంటనే ఫ్యాక్టరీ తెరిపించాలని, లేని పక్షంలో ఫ్యాక్టరీని ప్రభుత్వ స్వాధీనం చేసుకుని కొనసాగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిశెట్టి వీరబాబు, వి రాజేష్, గంగరాజు, చక్రధర్, దుర్గాప్రసాద్, వి వీరబాబు, ఎస్ జయలక్ష్మి, వై శివవరలక్ష్మి, కె కృష్ణవేణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు ఉన్నారు.

# బాలికోన్నత పాఠశాలలో మాక్ ఎలక్షన్స్



ప్రజాభూమి, గొల్లప్రోలు

గొల్లప్రోలు లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 26న జరగబోవు రాజ్యాంగ, సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. 8,9,10 తరగతి విద్యార్థులు ఓటర్లుగా, ఏడవ తరగతి విద్యార్థులు పోలింగ్ సిబ్బంది గా వ్యవహరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు యామిని ప్రసాద్,సబిత విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ పై అవగాహన కల్పించారు. కౌంటింగ్ నిర్వహించి విజేతలను ఏ విధంగా ప్రకటిస్తారో ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్య ప్రకాశ్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# మామిడి రాజు ను పరామర్శించిన కూనవరం టీడీపీ నాయకులు



ప్రజాభూమి, వి.ఆర్.పురం

ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మండల టీడీపీ నాయకులు మామిడి రాజు ను, కూనవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం రేఖపల్లి లోనీ ఆయన నివాసం వద్ద కలిసి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని, పార్టీకి సేవలందించాలని అరకు పార్లమెంట్ టిడిపి ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కూనవరం టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు, చేలకాని ఉమా మహేశ్వరరావు, సోమయ్య, మీడియా ప్రతినిధులు యలం సీతారామయ్య పాల్గొన్నారు.

# మహారాష్ట్ర లో విజయం పై బిజెపి నాయకుల హర్షం



ప్రజాభూమి, గొల్లప్రోలు

మహారాష్ట్రలో బిజెపి కూటమి ఘన విజయం సాధించడం పై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు బిజెపి పట్టణ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో మహారాష్ట్ర లో పవన్ కల్యాణ్ ప్రచారం చేసిన స్థానాలలో బిజెపి అత్యధిక మెజారిటీ తో సాధించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్ చార్జ్ మర్రెడి శ్రీనువాస్ ను చేబ్రోలు లోని పవన్ నివాసంలో కలిసి సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లు,గండి కొండలరావు, డివిఎస్ రాజు,బుర్రి మురళీధరరావు,తోట ఏడుకొండలు,చిట్టా మధు,పసుపులేటి సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ,వాసంశెట్టి శ్రీనువాసురావు,కొమ్మినేని భద్రారావు, అడబాల వీరమోహనరావు, వియ్యపు రాములు, మేడసాని కామరాజు, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాదం కల్పించునున్న సాయి ప్రియ సేవా సమితి

ప్రజాభూమి శంఖవరం :

గొల్లప్రోలు పట్టణంలో గల పలు దేవాలయాల భజన సమాజ బృందాలు, విశ్వ హిందూ పరిరక్షణ సభ్యులు, శ్రీ విజయ దుర్గ అమ్మవారి కమిటీ సభ్యులు కలిపి ఈ నెల 24వ తేదీ ఆదివారం నాడు పాదయాత్ర ద్వారా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దర్శనానికి విచ్చేయుచున్నారు. పాదయాత్రగా వస్తున్న భక్తులకు సాయి ప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నవరంలో అన్న ప్రసాదం సదుపాయం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా సాయి ప్రియ సేవా సమితి చైర్మన్, వ్యవస్థాపక అధ్యక్షులు జ్యోతుల గంగాభవాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్తీక మాసంలో పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేయుచున్నానని, సుమారు 2000 మంది భక్తులు పాల్గొంటారని, కార్తీక మాసంలో పరమశివుడు మాకు కల్పించిన వరంగా భావిస్తున్నామని అన్నారు.



# క్షేత్రస్థాయిలోని రెవెన్యూ సంస్థలు పరిష్కారానికి అధికారులు అవసరమైన చర్యలు చేపట్టండి.

## కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ

క్షేత్రస్థాయిలోని రెవిన్యూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా..డీఆర్వో జె.వెంకటరావుతో కలిసి రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, రోడ్డు భవనాలు శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులు, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి తిసుకున్న చర్యలు, నగర వనం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులకు స్థలం గుర్తింపు, రీ సర్వే గ్రామసభల నిర్వహణ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వంటి అంశాలపై జేసీ క్షేత్రస్థాయి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ.. జిల్లాలో నిర్మాణ పనులకు సంబంధించి ఆటంకం లేకుండా వేమగిరి, తీపర్రు దగ్గర రెండు ఇసుక రీచ్చులు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలు మూడు ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వహణకు అవసరమైన ఏజెన్సీలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని త్వరలో ఇసుక స్టాక్ పాయింట్లు నుంచి కూడా ఇసుక బుక్ చేసుకివచ్చాని జేసి తెలిపారు. జాతీయ రహదారి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేసి, పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో రెవెన్యూ విషయాలపై అందిన అర్జీలపై శ్రద్ధ వహించి అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలన్నారు. నగర వనం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు ఏర్పాటుకు ప్రభుత్వ భూముల గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా మొదలయ్యేయని, ధాన్యం కొనుగోలు నిమిత్తం జిల్లాలో 277 రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగిందన్నారు. క్షేత్రసాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. రిజర్వేకు సంబంధించ వివిధ మండలాల్లో జరిగిన గ్రామసభలలోని అంశాలను జేసీ రాహుల్ మీనా అధికారులతో చర్చించారు.

సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీమణి, ఎన్ఎచ్ఏఐ పీడీ డీ.బెనర్జీ, రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కాంత్తు, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.దేవుల నాయక్ అన్ని మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా అభివృద్ధి, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్ లో గళం వినిపిస్తా

## కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ

కాకినాడ జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్ లో గళం వినిపిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ళ శనివారం ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 20 వరకు జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఢిల్లీకి పయనమయ్యారు. అంతకుముందు శుక్రవారం మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పార్లమెంట్ లో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో కూటమి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి కలిసికట్టుగా పోరాడుతామన్నారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా అభివృద్ధి కోసం కొత్త ప్రాజెక్టులు మంజూరు తోపాటు,పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేలా కేంద్ర సహకారం కోరతానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల్లో వైసిపి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి తమ అధినేత కోసం మాత్రమే పోరాడారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఎంపీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

# ప్రజా హక్కుల సభను విజయవంతం చేయండి

## సిపిఐ ఎంఎల్ లేబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారు రావు



ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ డిసెంబర్ 4 న విజయవాడలో జరగానున్న "ప్రజా హక్కుల సభ" ను విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు పిలుపు నిచ్చారు. సూపర్ సిక్స్ మాత్రమే కాదు ప్రజల కోరే " పీపుల్ సిక్స్" సాధించాం. అని , అలాగే తెలుగు నేల నుండి మత రాజకీయాలను తరిమెద్దాం. ప్రజా పోరాటాలతో నిజమైన ప్రజా ప్రతిపక్షాన్ని నిలబడదాం. అని చెప్పి డిసెంబర్ 4 న విజయవాడలో జరుగపుతున్న సభను విజయవంతం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ మాత్రమే కాదు పీపుల్స్ సిక్స్ ను అమలు చేయాలని అని అన్నారు .1 విద్యార్థులకు న్యాయమైన విద్యను ప్రభుత్వం ఉచితంగా అందించాలి. నూతన విద్యా విధానం రద్దు చేయాలి. విద్యారంగ ప్రైవేటుగా నిలిపివేయాలి. ప్రతి సంవత్సరం 15 లక్షలు ఉద్యోగాలు కల్పన కలిగే లా చెయ్యాలి.ఉద్యోగం ఇచ్చేవరకు నిరుద్యోగులకు నెలకి ఉద్యోగ భృతి 5000 రూపాయలు ఇవ్వాలి .2.పరిశ్రమలు సంస్థలు ప్రైవేటుగా నిలిపివేయాలి అన్ని రంగాల కార్మికులకు ఆరోగ్య భీమా వర్తింపజేయాలి. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులకు 600 రూపాయలు కనీస వేతనం మరియు 200 రోజులు పరిధిలో కల్పించాలి ఎనర్జీ తరహాలోనే పట్టణ పేదలు కూడా సమగ్రమైన ఉపాధి హామీ పథకం రూపొందించి అమలు చేయాలి. నిరుపేదలకు భూమి, ఇల్లు లేని వారికి ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలి. పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఇతర కాంట్రాక్టు విధానం రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వ నియమాల ప్రకారం రూ. 35 వేలు కనీస వేతనం ఇవ్వాలి. ఈ " పీపుల్ సిక్స్ " ని అమలు చేయాలని అన్నారు. విజయవాడలో డిసెంబర్ 4వ తారీఖున పెద్ద ఎత్తున సభ జరగబోతోంది. ఈ సభకు ముఖ్య అతిథిగా సిపిఐ (ఎంఎల్) జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య గారు హాజరు కానున్నారని అన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు పిలుపు నిచ్చారు.

# తుని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రామేశ్వర్రావు వర్ధంతి

## పట్టణాభివృద్ధి లో కుసుమంచి సేవలు నిరుపమానం



ప్రజా భూమి తుని

దివంగత కుసుమంచి రామేశ్వరరావు చిరస్మరణీయులు.వ్యాపార దిగ్గజమే అయినా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు వరసలో నిలిచి అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు.స్వర్గీయ రాజా బుల్లి బాబు గారి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు గా మెలిగిన రామేశ్వరరావు రాజకీయ రంగంలో కూడ సుస్థిర స్థానమే పొందారు.మున్సిపల్ వైస్ చైర్మన్ గా పనిచేసిన ఆయన తుని పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించారు.అలాగే మార్కట్ కమిటీ వైస్ చైర్మెన్ గా వ్యవహరించిన రామేశ్వరరావు అటు రైతు అభ్యున్నతికి ఇటు వ్యాపారులు ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేసిన మహానీయుడు.ఇక రోటరీ క్లబ్ ఇతర సేవా సంస్థలు ద్వారా అనేక ప్రజాభ్యుదయ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు.తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపనలో కీలక పాత్ర పోషించిన కుసుమంచి రామేశ్వరరావు విద్యా ప్రదాతగా నిలిచారు.ఇవాళ కుటుంబ సభ్యులు కుసుమంచి సుబ్బారాయుడు వరలక్ష్మి దంపతులు,కుసుమంచి శోభారాణి సత్యనారాయణ దంపతులు కుసుమంచి ఎరకయ్య ఆధ్వర్యంలో జరిగిన దివంగత రామేశ్వరరావు ప్రధమ వర్ధంతి వక్తలు ఆయన సేవానిరతిని కొనియాడారు.ముఖ్య అతధిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు పట్టణ ప్రముఖులతో జ్యోతి ప్రజ్వలన గావించారు.అనంతరం రామేశ్వర్రావు చిత్రం పటానికి పుష్పాంజలి ఘటించారు

ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త చక్కా సూర్యనారాయణ, పెనుగొండ ప్రకాశరావు, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్వీకే నర్సింహారావు, సిటీ కేబుల్ ఎం డీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి,మాజీ మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ,తాండవ షుగర్స్ మాజీ చైర్మెన్ సుర్ల లోవరాజు, కలిదిండి సత్యనారాయణరాజు,రామచంద్ర రాజు, దొంతంశెట్టి మల్లి బాబు, కుక్కడపు బాలాజీ, నందిబాబు, భరద్వాజ్,సకురు నాగేంద్ర నెహ్రూ,పరవాడ తాత బాబు,ఆకెళ్ళ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు

# ఆదిత్య పాఠశాల తల్లిదండ్రులకు ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్



ప్రజా భూమి ప్రతినిధి పిఠాపురం

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం సీతయ్యతోటలోని ఆదిత్య పాఠశాల ఆవరణలో ఆదిత్య పాఠశాల తల్లిదండ్రులకు ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ అనే మోటివేషన్ ప్రోగ్రామ్ జరిగింది.ప్రముఖ మోటివేషన్ స్పీకర్ మాకెన సతీష్ చే తల్లిదండ్రులకు ఏర్పాటు చేయబడిన కార్యక్రమములో పిల్లలను తీర్చిదిద్దే విధానంపై, ప్రస్తుత నవ సమాజంలో తల్లిదండ్రుల యొక్క పాత్ర ఎంతటి విశిష్టమైందో సుదీర్ఘ ఉపన్యాసంతో తెలిపారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య స్కూల్స్ డైరక్టర్ శృతిరెడ్డి మాట్లడుతూ నేటి తరంలోని విద్యార్థులకు అనుగుణంగా విద్యా వ్యవస్థను ఆధునీకరించుచూ విద్యార్థల బంగారు బాటలు వేసే ఆదిత్య సంస్థలు,ఆ దిశగానే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా శిక్షణ అవసరమని, ఒక విద్యార్థి భవిష్యత్తుకు ఉపాయధ్యాయులు మరియు తల్లిదండ్రులు పరస్పర సహకారం ఎంతో మేలు కలిగిస్తుందని,అటువంటి అవసరం గమనించి,తల్లిదండ్రులకు కూడా సరైన మార్గ దర్శకత్వం కలిగించగల మార్గదర్శకులు సతీష్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు.సంస్థ చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ ఒక విద్యార్థి పురోగమనంలో తల్లిదండ్రుల పాత్ర చాలా విశిష్టమైనది అని తెలిపారు.ఇటువంటి వినూత్న కార్యక్రమానికి ఆదిత్య సంస్థలు ఎప్పుడూ ముందుంటాయి అని తెలిపారు.అనంతరం ఆదిత్య స్కూల్ పిఠాపురం ప్రిన్సిపాల్ విజయసారథి మాట్లాడుతూ ఈ కార్యక్రమము తల్లిదండ్రులకు చేరువ కావాలనే సదుద్దేశ్యంతో 22,23 ఈ రెండు రోజులు నిర్వహించమని తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఇన్చార్జు శ్రీనివాస్ మరియు రేవతి కార్యక్రమమును జయప్రదం చేసిన ప్రతివారికి కృతజ్ఞతలు తెలిపి కార్యక్రమమును ముగించారు.ఈ కార్యక్రమములో తల్లిదండ్రులు ఇటువంటి కార్యక్రమమును నిర్వహించిన ఆదిత్య యాజమాన్యానికి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.వారికి తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కలిగిందని, విద్యార్థుల బాటకు వారిపాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

# సైబర్ సెక్యూరిటీ విమెన్ ఎంపవర్మెంట్ పై సదస్సు



ప్రజా భూమి గండేపల్లి.

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల లో రోడ్డు ప్రమాదాలు,సైబర్ సెక్యూరిటీ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ అనే అంశం పై బి టెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ తెలిపారు.ఈ సదస్సు గండేపల్లి ఎస్సై యు వి శివ నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కె శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు గురించి, సైబర్ సెక్యూరిటీ మరియు ఉమెన్ ఎంపవర్మెంట్ గురించి సూచనలు తెలియచేసారు.

ప్రజాభూమి


## డెడ్జింగ్ పై డాక్టర్ రాణి సుస్మిత ఆకస్మిక తనిఖీ బోట్ల సీజ్

ప్రజా భూమి కొవ్వూరు



కొవ్వూరులో డ్రెడ్జింగ్‌పై ఎంపీపీ కొవ్వూరు ఫిర్యాదు మేరకు 22 వ తేదీ నుంచి ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి.

డ్రెడ్జింగ్ బోట్లను కనిపెట్టేందుకు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఔరంగాబాద్-2 పాయింట్ వద్ద 23వ తేదీ రాత్రి 7 గంటలకు 3 డ్రెడ్జింగ్ బోట్లను గుర్తించారు.కొవ్వూరులోని తహశీల్దార్‌తో పాటు ఆర్‌డిఓ తనిఖీలు నిర్వహించారు. సి ఐ, ఏ ఈ నీటిపారుదల శాఖ మరియు టాస్క్ ఫోర్స్. బోట్లను సీజ్ చేయడానికి అధికారులందరినీ అప్రమత్తం చేశారు మరియు ఎఫ్ ఐ ఆర్ ఉంది దీనిపై ఇంకా దాఖలు చేయాల్సి ఉంది.

## ఈనెల 27 నుండి ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణలు

ప్రజా భూమి ఆలమూరు





ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ వీరుడు బ్రూస్లీ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 27 నుండి ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణలు ఇస్తున్నట్లు మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువకులు మత్తు పదార్థాలకు అలవాటపడి వాటి నుండి బయటపడలేక అనారోగ్యం పాలవుతున్నారని, అలాంటి వారికి ఈ మార్షల్ ఆర్ట్స్ వ్యాయామం వలన ఎంతో ఉపయోగకరమవుతుందని, అదేవిధంగా యువతులు బాలికలు హత్యాచారాలకు గురవుతున్నారంటే ఇలాంటి వారి నుండి ఎలా ఎదుర్కోవాలి అవగాహన లేకనని, ఆడవారికి భూదేవికి మించిన శక్తి సామర్థ్యాలు ఉంటాయి. అలా ఉన్నప్పటికీ ఎదుర్కొనే ఆత్మరక్షణ మెలకువలు ధైర్యం కలిగించే ఆత్మరక్షణ, శిక్షణ లేక యువతలు అత్యాచారాలకు గురవుతున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా యువకుల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించే వారు లేక చెడు మార్గాలకు అలవాటు పడుతున్నారని, అలాంటి వారికి కొంతైనా ఈ కుంగ్ ఫు కరాటే తైక్వాండో బాక్సింగ్ వల్ల ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలని ఉద్దేశంతో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7.30 వరకు ఆలమూరు శివారు ప్రాంతమైన కొత్తూరు సెంటర్ బస్టాండ్ పక్కన రైస్ మిల్లు వద్ద నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఆలమూరు, అంగర, మండపేటలో మార్షల్ ఆర్ట్స్ వ్యాయామ శిక్షణలు ఇస్తున్నామని అబ్బులు తెలిపారు. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి ఆరోగ్యమే మహాభాగ్యం యువత యువకులకు చిన్నారులకు శారీరిక ఉల్లాసాన్ని ప్రశాంతతను కలిగించేది ఆస్తిపాస్తులు కాదు మనం చేసే కరాటే మార్షల్ ఆర్ట్స్ వ్యాయామం పట్ల కలిగే ఆరోగ్యం మాత్రమే అందరూ ఆలోచించాలని అబ్బులు తెలిపారు.

## కృత్తివెంటి పేర్రాజు పంతులు బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీవో అఖిల!

**విద్యార్థినిలకు ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు పెట్టిలో వేయండి.**
**మధ్యాహ్న భోజన పథకం నాణ్యత పరిశీలన.**
**మహిళా పోలీసులు పాఠశాలను పర్యవేక్షిస్తున్నారా అని ఆరా.**





ప్రజాభూమి, రామచంద్రపురం.

రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల శనివారం పట్టణంలోని కృతివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాల,జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను తనిఖీ చేసారు. పాఠశాలలో విద్యార్థినిలతో కొంతసేపు ముచ్చటించి పాఠశాలలో వసతులుపై అడిగితెలుసుకున్నారు. అనతంరం పాఠశాలలో అమలౌవుతున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అమలు చేస్తున్న అకాడమిక్ ప్లాన్ ని అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసులు పాఠశాలను పర్యవేక్షిస్తున్నారా?అని ఈసంధర్బంగా ఆర్డీవో ఆరా తీశారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదుల పెట్టెలో పేరు తెలపకుండా సమాచారం ఇవ్వాలని అలా వచ్చిన పిర్యాదులు పై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో అఖిల విద్యార్థినిలకు భరోసా ఇచ్చారు..

## పందులను కట్టడి చేసుకోవాలి!

**యజమానులకు మున్సిపల్ అధికారులు హెచ్చరిక.**
**చంచరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదు.**

ప్రజాభూమి, రామచంద్రపురం.

యజమానులు పందులను విచక్షణారహితంగా వదిలివేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పురపాలక సంఘ అధికారులు హెచ్చరించారు. ఈమేరకు శనివారం రామచంద్రపురం పురపాలక సంఘం నందు పందులు విచక్షణారహితంగా సంచరించడంపై వచ్చిన ఫిర్యాదులపై పందుల యజమానులతో కమిషనర్ వి.ఐ.పి.ఐ.నాయుడు ఆదేశాల మేరకు మేనేజర్ శ్రీరామచంద్ర మూర్తి సమక్షంలో పందుల యజమానులను పిలిపించి ప్రజలు పందులతో పడుతున్న ఇబ్బందులను చెప్పి యజమానులు తీసుకోవలసిన జాగ్రత్తలను మేనేజర్ ఈసంధర్బంగా వివరించారు .ప్రజల నుండి అనేక ఫిర్యాదులు పలుమార్లు వస్తున్నాయని కాబట్టి పందులను యజమానులకు కట్టడి చేసుకోవాలని అన్నారు . ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిందిగా తెలిపారు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో పందులను కట్టడి చేసుకోమని ఈసంధర్బంగా తెలియజేసారు . ఇక మీదట పట్టణంలో పందులు చంచరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవసిన అవసరం ఉందని ఈసంధర్బంగా హెచ్చరించారు.



## తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలి.

**ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి.**
**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు**
**- కలెక్టర్ పి. ప్రశాంతి**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

డిసెంబర్ 5 వ తేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల

పోలింగ్ ప్రక్రియకు సంబంధించి రెవిన్యూ పోలీస్ ఇతర ఎన్నికలు విధులు నిర్వహించే ఎంసిసి, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, ఎం సి ఎం సి బృందాల చేపట్టి నిధులపై కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పి డి.నర్సింహ కిషోర్ , జెసి చిన్న రాముడు, సహాయ ఎన్నికల అధికారి, డి ఆర్వో టి సీతారామ మూర్తి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 5 వ తేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సజావుగా నిర్వహించాలన్నారు.




ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం అయిదు మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం 2894 మంది ఉపాధ్యాయుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 1589 పురుషులు కాగా 1305 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 21 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలు, 20 ఎఫ్ ఎస్ టి బృందాలు, 6 ఎస్ ఎస్ టి బృందాలను.

నియమించమన్నారు. అన్ని సెక్టోరల్ రూట్ అధికారులు ముందుగానే వారికి కేటాయించిన మండలాల్లోని రూట్ లను పరిశీలించుకోవాలన్నారు. వనరులబుల్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కు ముందురోజు పోలింగ్ మెటీరియల్ ఆర్ట్స్ కళాశాల లో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పిఓ, పిఓలకు, ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనుభవం కలిగిన వారికి ఎన్నికల విధుల్లో నియమించడం జరిగింది అని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని, త్రాగునీరు, విద్యుత్ , షామియానాలు, ర్యాంపులు, టాయిలెట్, టెలిఫోన్, తదితర వసతులను కల్పించామన్నారు.

జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 5 వ తేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 20 రూట్లలో, పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రం లోను, రిసెప్షన్ సెంటర్ నందు, ప్రవేశ ద్వారము, బయటికి వెళ్లే మార్గం నందు పోలీస్ భద్రతను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా అంతర్ జిల్లాల సరిహద్దుల్లో ని చెక్ పోస్ట్ నందు ఫ్లేయింగ్ స్క్వాడ్స్ నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు. డిఆర్ఓ , సహాయ ఎన్నికల అధికారి టి. సీతారామమూర్తి, ఎన్నికల అధికారి ఎమ్. మాధురి, ఆర్డీవోలు ఆర్. కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డి.ఎస్.పిలు టీవీఆర్కే కుమార్, కే.రమేష్ బాబు, డీటిఓ ఎన్.సత్య నారాయణ,జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, పాల్గొన్నారు.

## డిసెంబర్ 30 తేది న ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఎలక్టోరల్ రోల్స్ తుది జాబితా

**గతంలో కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదన**
**తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్ సి పట్టభద్రుల ఎన్నిక ఓటర్ల నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధుల తో సమీక్షించిన....**
**డిఆర్ఓ టి. సీతారామమూర్తి**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్ సి పట్టభద్రుల ఓటర్లగా నవంబర్ 23 వ తేదీ నాటికి 51,624 మంది గ్రాడ్యుయేట్స్ ఓటర్లుగా తమ దరఖాస్తు నమోదు చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం డిఆర్ఓ ఛాంబర్ లో డిఆర్ఓ సీతారామమూర్తి రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్ సి పట్టభద్రుల ఓటర్ల గా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దరఖాస్తులు నవంబర్ 23 వ తేది నాటికి 51,624 దరఖాస్తు వచ్చాయని, ఇందులో



పురుషులు 30292 మంది, మహిళలు 21328 మంది ఇతరులు 14 మంది ఉన్నారన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా డిసెంబర్ 9 వ తేదీన ప్రకటించనున్నట్లు తెలిపారు. గతంలో కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు పెరుగు తాయన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం షెడ్యూల్ వివరాలు ప్రకారం అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాల వ్యవధి నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వ తేది వరకు ఉంటుందన్నారు. క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు సప్లిమెంట్‌లను పరిష్కరించే తేదీని సిద్ధం చేయడం జరుగుతుందని, డిసెంబర్ 25 వతేదిన ఎలక్టోరల్ రోల్స్ ప్రచురణ కాగా, పట్టభద్రుల ఓటర్ల తుది ఓటర్ల జాబితా డిసెంబర్ 30 వ తేదిన విడుదల చేయడం జరుగు తుందన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ అయ్యే ఓటు చెల్లుబాటు అయ్యే విధంగా రాజకీయ పార్టీలు మాన్యుయేల్ ఓటింగు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మండలానికి కనీసం ఒక పోలింగ్ స్టేషన్‌ను ప్రతిపాదించడం జరుగుతుందన్నారు. ఓటరు తన ఓటు వేయడానికి ప్రయాణించాల్సిన గరిష్ఠంగా అనుమతించదగిన దూరం 16 కి.మీ. ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్ని ప్రభుత్వం భవనాల్లోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2 కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 4 పోలింగ్ స్టేషన్లు ఒక ప్రదేశంలో అనుమతించడం జరగదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, పిడబ్ల్యుడి ఓటర్లకు ర్యాంప్‌లు వంటి కనీస ప్రాథమిక సౌకర్యాల లభ్యతను సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు సిపిఎం పార్టీ తరఫున కర్రి రామకృష్ణ, బీఎస్పీ పార్టీ తరఫున పులగల ప్రదీప్ తదితరులు పాల్గొ న్నారు.

## సంక్షేమం అభివృద్ధికే పట్టం కట్టారు!బిజెపి అధ్యక్షులు సలాది వీరబాబు

**మహారాష్ట్రలో కూటమి విజయంపై కాజులూరు బిజెపి హర్షం.**

ప్రజాభూమి, రామచంద్రపురం

మహారాష్ట్రలో బిజెపి కూటమి మహాయుతి విజయం సాధించడంతో మహారాష్ట్ర ప్రజలు ప్రదాని మోదీకి మద్దతుగా ఉన్నారనేదానికి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం నియోజకవర్గ కాజులూరు మండలం బిజెపి అధ్యక్షులు సలాది వీరబాబు పేర్కొన్నారు. ఈసందర్భంగా మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి సెంచరీ కొట్టడంపై కాజులూరు బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమి (మహాయుతి) 288 స్థానాలకుగాను 225స్థానాలు కైవసం చేసుకొని దూసుకుపోయిందని మేజిక్ పిగర్ 145 స్థానాలు మాత్రమే అయినప్పటికీ అక్కడ మహారాష్ట్ర ఓటర్లు అభివృద్ధి సుపరిపాలనకే పట్టం కట్టారని వీరబాబు అన్నారు . గతంలో కన్నా అత్యధిక స్థానాలు సొంతం చేసుకొని తిరిగి బిజెపి అదికారం సొంతం చేసుకొందని,చరిత్ర సృష్టించిన ఎన్డీఏ కూటమికి



నరేంద్రమోదీకి తిరుగులేదని మరోసారి అక్కడ ప్రజలు తీర్పుతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందించే అభివృద్ధి సంక్షేమం పథకాలు మార్క్ కచ్చితంగా ప్రజలు గ్రహించి భారీస్థాయిలో మెజార్టీ ఇచ్చి నిరూపించారని వీరబాబు అన్నారు.. ఈవిజయంతో మరింత ఐక్యతతో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఇక్కడ ఫలితాలే నిదర్శనమని అన్నారు. బారీ విజయం అందించిన ఓటర్లకు ఈసంధర్భంగా వీరబాబు ధన్యవాదాలు తెలిపారు.

## జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి వినతి పై స్వదేశానికి చేరుకున్న గారా కుమారి

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ

బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురైన గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మహిళ గారా కుమారి రాష్ట్ర ప్రభుత్వ చొరవతో శుక్రవరం సురక్షితంగా తిరిగి స్వదేశానికి వచ్చింది. భర్త చనిపోయి, ఇళ్లు గడవడం కష్టమైన పరిస్థితులల్లో తన ముగ్గురు పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం ఈమె పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఏజెంట్ యం.సుధాకర్ ద్వారా గత మే నెల 1వ తేదీన ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లింది. కువైట్ దేశంలో 30 వేల జీతంతో ఇంటి పనులు చేసేందుకు ఉద్యోగంలో చేరింది. అయితే తాను పనిచేసే యజమాని తీవ్ర ఇబ్బందులకు, చిత్రహింసకు గురిచేయడంతో నరక యాతనకు లోనైంది. ఉపాధి కోసం వెళ్లి విదేశాలలో నానా యాతనలు పడుతున్న వారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదుకుంటున్న విషయాన్ని తెలుసుని, దేశం కాని దేశంలో తాను పడుతున్న అవస్థలను వీడియోగా చిత్రీకరించి, తన సోదరుడు కర్రిపోతు సూర్యచంద్ర ద్వారా వారికి పంపింది. హృదయ విదారకమైన ఆమె దీన పరిస్థితికి చలించిన



మంత్రులు ఇరువురు కువైట్ లోని భారత రాయభార కార్యాలయంతో చర్చించి ఆమె తిరిగి స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసారు. ఇరువురి చొరవతో గారా కుమారి కువైట్ నుండి విమానంలో హైదరాబాదు చేరుకుని, శుక్రవారం రాత్రికి తన సొంతూరు యల్లమిల్లి లోని తన ఇంటికి చేరుకుంది. ఆమె రాక తో ఎదురు చూస్తున్న పిల్లలు, కుటుంబ సభ్యులు పొందిన ఆనందానికి అవధులు లేవు. కష్టాల చీకటిలో కొట్టాడుతున్న తమ కుటుంబానికి కొండంత అండగా నిలచి ఆదుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు గారా కుమారి, ఆమె కుటుంబ సభ్యులు చేతులెత్తి నమస్కరిస్తూ వారికి సదా రుణపడి ఉంటామని తెలియజేశారు. అలాగే తాను తిరిగి స్వదేశానికి రావడానికి ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కి, జిల్లాయంత్రాంగానికి గారా కుమారి ధన్యవాదాలు తెలియజేసింది.

## వైభవంగా సత్య సాయి జన్మదినోత్సవ వేడుకలు!

ప్రజాభూమి, రామచంద్రపురం.

భగవాన్ శ్రీసత్యసాయి బాబా 99వ, జన్మ దినోత్సవ వేడుకలు శ్రీసత్యసాయి మందిరం ద్రాక్షా రామ నందు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు శనివారం కన్వీనరు విస్సాప్రగడ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉదయం నగర సంకీర్తన, ప్రశాంతి పతాకం ఆవిష్కరణ అష్టోత్త ర పూజ, 99 మంది నారాయణులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈసంర్భంగా 99 స్వామి చిత్ర పటాలను ప్రదర్శించగా "భజన" ప్రసాదం వితరణ జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి,వై. రాజారావు, కె. ఎస్. పాపాజీ, పెన్నాడ వెంకట్రావు సమయ మంతుల గణేష్, సమయమంతుల లక్ష్మి సుతాపల్లి విజయలక్ష్మీ సాయి తదితరులు భక్తులు పాల్గొన్నారు.



## అన్నింటా ప్రతిభ కనబరుస్తున్న వాసవి విద్యార్థులు

ప్రజాభూమి మార్కాపురం




మార్కాపురం లోని వాసవి విద్యానికేతన్ విద్యార్థులు శ్రీ సత్యసాయి సేవా సేవా సమితి వారు శ్రీ సత్యసాయి బాబా 99 వ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో మార్కాపురం వాసవి విద్యార్థులకు 8 బహుమతులు వరించాయి. స్థానిక N.S నగర్లోని సత్యసాయి పరన్ లో శ్రీసత్యసాయి బాబా వారి జయంతి వేడుకలలో విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే" గ్రంథాలయ వారోత్సవాలలో కూడా వాసవి విద్యానికేతన్ విద్యా ర్థులు వ్యాస రచన, పాటలు, వకృత్వ, చిత్రలేఖనం మొదలైన పోటీలలో పాల్గొని మొత్తం 15 బహు మతులు సాధించారు. ఎక్కడ ఎటువంటి పోటీలలో పాల్గొన్న అన్నిట్లో ముందుండి చిహు మతులు సాధిస్తున్న విద్యార్థులను ప్రిన్సిపల్ డైరెక్టర్ కె. రంగయ్య ఏ డి కె రంజిత్ కుమార్ ప్రశంసలు అందించారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు హర్షం వ్యక్త పరిచారు.

## ఎమ్మెల్యే సన్మానం చేసిన పలకల మ్యానుఫ్యాక్టర్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం పలకల, మ్యాను ఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కి అసోసియేషన్ తరపున సన్మానం చేయబడినది మన నారాయణరెడ్డి శాసనసభలో పలకల పరిశ్రమ గురించి, పలకలు వినియోగించేవారు తగ్గినది దానివలన, పరిశ్రమ అంతరించిపోతున్నది అని శాసనసభ,సభలో మాట్లాడినాడు, కావునదయవుంచి సాక్షర సమితి లో,ఉచితంగా ఇచ్చే కిట్టులో పలకలు కూడా చేర్చవలసిందిగా కోరుచున్నాము అని శాసనసభలో మాట్లాడినాడు, ఈ కార్యక్రమం కు స్లేట్ మర్చంట్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ బొంతలసుధీర్ కుమార్, బిజెపి ప్రకాశం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బొంతల కృష్ణ మరియు స్లేట్ మర్చంట్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ పేరం ప్రసాద్, మరియు నారాయణం శ్రీనివాస్, మాడిశెట్టి శంకర్, పాదర్తి శ్రీనివాసరావు మరియు మోదాల శ్రీనివాసులు మొదలగువారు ఈ కార్యక్రమం కు వచ్చినారు

## చెప్పింది ఆచరణలో చూపిన నేత వై.ఎస్.జగన్ వైసీపీ మైనార్టీ నేత సయ్యద్ గౌస్ మోహియుద్దీన్

ప్రజా భూమి మార్కాపురం



మార్కాపురం.ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన హామీలను అధికారంలోకి వచ్చాక ఆచరణలో చేసి చూపించిన నేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అని వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ మోహియుద్దీన్ అన్నారు. ఐదేళ్ల పాలనలో మూడేళ్లు కరోనా కారణంగా రాష్ట్రంపైతీవ్ర ఆర్థికమాంధ్యంలోనున్న ఇచ్చిన హామీలే కాకుండా చేయని హామీలను కూడా అమలు చేసి చూపించారని ఆయన గుర్తుచేశారు. కానీ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఖజానా ఖాళీ తమ్ముడు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి కూటమి సర్కార్ కు జగన్మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ఆ తరువాత వైసీపీ పేరెత్తితే బాగుటుందని ఏపీలోని కూటమి సర్కార్ కు ఆయన సూచించారు. జగన్మోహన్ రెడ్డి ముందు ముఖం చెల్లని కూటమి నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

## ఫారెస్ట్ డిఆర్ఓ అరెస్టు చేయాలని గుండంచర్ల గ్రామస్థుల నిరసన

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామస్థుల నిరసన చేపట్టారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకోసం పశువులను తోలుకెళ్లిన పశువుల కాపరిపై డీఆర్ఎ నాగరాజు దాడి చేశారు. డీఆర్ఎను అరెస్ట్ చేయాలని నినాదాలు చేస్తూ గ్రామస్తులు బైఠాయించారు. డీఆర్డీపై తగిన చర్యలు తీసుకొని పశువుల కాపరికి న్యాయం చేయాలంటూ సబ్ కలెక్టర్ వెంకట త్రివినాథ్కు వినతిపత్రం అందజేశారు.

## అభివృద్ధి పక్షం నిలిచిన మహారాష్ట్ర ప్రజలు: డాక్టర్. ఏలూరి

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరు రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.. మహారాష్ట్ర ప్రజలు అభివృద్ధిని గెలిపించుకున్నారని అన్నారు.. ప్రధాని నరేంద్ర మోడీ గారి అభివృద్ధి నినాదాన్ని ప్రజలు అర్థం చేసుకొని ఆ దిశగా అధికారం కట్టబెట్టారన్నారు.. కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరు నమ్మకపోవడం హర్షించదగ్గ విషయం అని చెప్పారు.. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వం మీద అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.. కాగా మహారాష్ట్రలో భారీ విజయం సాధించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, జాతీయ ఇన్చార్జి మరియు కేంద్ర మంత్రి ఉపేంద్ర యాదవ్ తదితరులకు డాక్టర్ ఏలూరి అభినందనలు తెలిపారు.. అలాగే తెలుగు రాష్ట్రాల నుంచి బిజెపి విజయాన్ని కాంక్షించి ప్రచారంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. అలాగే బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్నికల ఇన్చార్జులు.. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ్ తదితరులకు అభినందనలు తెలియజేస్తున్నట్టు ఏలూరి వెల్లడించారు.

# "అనంత" జిల్లాలో రోడ్ టెర్రర్-రక్తమోడిన రహదారి

- ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వ్యవసాయ కూలీల దుర్మరణం
- మరో ఆరుగురు గాయాలపాలు
- గార్లదిన్నె వద్ద జాతీయ రహదారిపై ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో దుర్ఘటన
- క్షతగాత్రుల్లో ఆటో డ్రైవర్ - అందరూ దళిత కూలీలే
- అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మృతులు, క్షతగాత్రుల తరలింపు
- క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పరామర్శించిన ఎంపీ అంబికా, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్.వీ., మాజీ ఎంఎల్ఏ అనంత వెంకటరామిరెడ్డి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ నాగరాజు

ప్రజాభూమి, అనంతపురము

అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై రక్తమోడింది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, దాదాపు 13 మంది కూలీలతో వెళుతున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొనడంతో ఏడుగురు వ్యవసాయ కూలీలు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి స్వల్ప, తీవ్ర గాయాలయ్యాయి. కూలీలందరూ దళిత సామాజిక వర్గీయులే.అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం, గార్లదిన్నె మండల పరిధిలోని కలగాసుపల్లి గ్రామం వద్ద



శనివారం సాయంత్రం ఈ ఘోర ఘటన జరిగింది. **మృతులు, క్షతగాత్రులు** అందరూ అనంతపురం జిల్లాలోని పుట్లూరు మండలానికి చెందిన ఎల్లుట్ల గ్రామస్థులే. ఇప్పటి వరకు మృతుల అందిన సమాచారం మేరకు మృతుల సంఖ్య ఏడుకు చేరింది.

**మృతుల వివరాలు :** డీ. నాగమ్మ, బీ. నాగమ్మ , బీ.నాగన్న, రామాంజనమ్మ, బాల పెద్దయ్య, కొండమ్మ, జయరాముడు. మరణించిన వారిలో బీ. నాగమ్మ, బీ. నాగన్న భార్యాభర్తలు.

**గాయపడిన వారు** : ఈశ్వరయ్య, గంగాధర, రామాంజినమ్మ, పెద్దులమ్మ, లక్ష్మీదేవి, ఆటో డ్రైవర్ నీలకంఠ ఉన్నారు. కూలీలంతా కలగాసుపల్లి గ్రామంలో అరటి తోటకు రసాయనిక ఎరువులు వేసి తిరుగు ప్రయాణమై స్వగ్రామానికి వెళుతుండగా ఈ దారుణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ నాగరాజు హుటాహుటిన చేరుకుని పరిశీలించారు.

అలాగే, క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పరామర్శించిన ఎంపీ అంబికా, జిల్లా కలెక్టర్ వినోద్



కుమార్.వీ., మాజీ ఎంఎల్ఏ అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు పరిశీలించారు. ఎమ్మార్పీఎస్ మాదిగ దండోరా నాయకులు ప్రభుత్వాసుపత్రి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆస్పత్రి విద్యాధికారులకు సూచించారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం నేత రాంభూపాల్ డిమాండ్ చేశారు.



# ప్రమాద ఘటన చాలా బాధాకరం

- ప్రమాదంలో చనిపోయిన ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి
- క్షతగాత్రులకు ప్రభుత్వం తరపున మెరుగైన చికిత్స అందిస్తున్నాం
- భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత ,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

ప్రజాభూమి, అనంతపురము

గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బస్సు – ఆటో ఢీకొన్న ప్రమాద ఘటన చాలా బాధాకరమని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. శనివారం రాత్రి అనంత పురం నగరంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రిలో గార్లదిన్నె మండ లం తలగాసిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బస్సు –



ఆటో ఢీకొన్న ప్రమాద ఘటనలో గాయపడి చికిత్స పొందు తున్న బాధితుల కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శిం చారు. అనంతరం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మార్చురీలో మృతదేహాలను మంత్రి పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ, జిల్లా ఎస్పీ జగదీష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు లారీని ఓవర్టేక్ చేస్తూ ఆటోని ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగి ఏడు మంది చనిపోవడం దిగ్భ్రాంతికరం అన్నారు. ప్రమాదంలో చనిపోయిన ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్గ్రేషియాను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు ప్రకటించడం జరిగిందన్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అప్ర మత్తమై బాధితులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారని, ప్రభుత్వం తరపున ఆసుపత్రిలో ఐదు మందికి చికిత్స అందిస్తున్నామన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగ కూడదని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఆదేశాలిచ్చామన్నారు. ప్రమా దంలో ఒకే కుటుంబంలో నలుగురు చనిపోయా రన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం తరపున మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇన్చార్జి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ఆత్మారాం, సిఐ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులకుమెటీరియల్ అందజేత..

ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ దర్శి రామకృష్ణ ఈ రోజు మార్కాపురం పూల సుబ్బయ్య కాలనీలోని మునిసిపల్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ కు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా అందరూ మంచి మార్కులతో పాస్ కావాలని ఆకాంక్షించారు. 550 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు మంచి బహుమతి ఇస్తానని ప్రకటించారు. డాక్టర్ దర్శి రామకృష్ణకి పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎన్.ఎస్. ఎ.ఎల్ .రవికుమార్ ధన్య వాదాలు తెలియజేసి సత్కరిం చారు. ఈ కార్యమంలో ప్రత్తి వెంకటేశ్వర్లు, టీచర్లు కె.వి.రమణారెడ్డి,




కె.వెంకటేశ్వరరావు, సుధాకర్, బాదుల్లా, శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మి, సువర్చలా రాణి, జయప్రకాష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## 18 మంది మణికంఠులకు ఒక్కొక్కరికి 500 రూపాయలు వితరణ

ప్రజా భూమి, కామారపుకోట

స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న భిక్షా కార్యక్రమాల్లో ద్వారకాతిరుమల విరజా సిరామిక్స్ అండ్ టైల్స్ కంపెనీ మణికంఠ కుచ్చుమాతలకుదారి ఖర్చుల నిమిత్తం నగదును అందజేశారు. స్థానికంగా ఉన్న పీఠాలలోని 18 మంది మణికంఠ లకు 500 రూపాయలు చొప్పున టైల్స్ కంపెనీ యాజమాన్యం తరఫునుంచి రఘుపతి రెడ్డి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు స్వాములు కడిపి పాపారావు, వీరమల్ల మధు, నందూరి భాను, కానూరు సతీష్, గురుస్వాములు చుక్కుళ్ళ



రమేష్, మున్నంగి శ్రీనివాస్, నూతి పవన్, త్రిమూర్తులు, పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు కోసం గ్రామాలలో క్యూ కడుతున్న ప్రజలు

ప్రజా భూమిప్రతినిధి, ఏలూరు

రేషన్ కార్డు లేని పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వీరందరికీ కొత్తగా రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది.అన్ని ప్రభుత్వ పథకాలు అందాలంటే కీలకమైన రేషన్ కార్డు కోసం ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఎదురు చూస్తున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నా.. వైకాపా ప్రభుత్వం మంజూరు చేయకుండా రిక్తహస్తం చూపింది.ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి వరకూ చేసుకున్న దరఖాస్తులను కూడా పరిగణనలోనికి తీసుకోవాలని నిర్ణయించారు. అన్నింటినీ పరిశీలించి అర్హులకు సంక్రాంతి కానుకగా అందిస్తారు.మారనున్న డిజైన్లుప్రస్తుతం ఉన్న రేషన్కార్డుల స్థానంలో కొత్తవి పంపిణీ



చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు డిజైన్లను ఎంపిక చేసే కసరత్తు చేపడుతోంది. ఇది పూర్తయ్యాక కార్డులన్నీ ముద్రించి పంపిణీ చేయనున్నారు.ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వివిధ పార్టీ నాయకులు కోరుతున్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకున్న జగ్గంపేట ఎస్సై

ప్రజా భూమి జగ్గంపేట

జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు గోకవరంనకు చెందిన కోళ్లు మేకలు, సెల్ ఫోన్లు దొంగతనాలకు పాల్పడుతున్న ప్రేమ్ కుమార్ అను ఆసామీ ఏజ్ 32 %ఎ% ని అరెస్టు సేసి అతని వద్ద నుండి సుమారు 70,000 రూపాయల విలువైన 4 కోళ్లు,ఒక %బఅఎషీశీఅ ఎఅనవ% స్వాధీనం చేసుకోవడం జరిగింది. ముద్దాయిని కోర్ట్ లో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించడం జరిగింది. ముద్దాయిని సబ్ జైల్ కు తరలించడం జరిగింది. సిఐ %=ఖ

# ఉద్యోగుల సమస్యలపై మౌనమేల?

## 30 శాతం ఐఆర్ ప్రకటించాలి-ఎస్టీయు రాష్ట్రనాయకులు రమణారెడ్డి, సుబ్రమణ్యం




ప్రజాభూమి పోరుమామిళ్ల:

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం మౌనంవీడి వెంటనే 30శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ని ప్రకటించాలని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి,రాష్ట్ర సిపియస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.శుక్రవారం పోరుమామిళ్ల లోని ఎస్టీయు భవన్ నందు రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రమణారెడ్డి, సుబ్రమణ్యంలు మాట్లాడుతూ, 11వ వేతన సవరణ గడువు ముగిసి 15 నెల లు కావస్తున్నా ఇంత వరకు 12వ వేతన సవరణ ఊసేలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఉద్యోగుల గోడు వినే అవకాశం ఇవ్వ కుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చి,అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. ఉపా ధ్యాయులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ,డిఎ బకాయిలు,జిడ్పీపిఎఫ్,ఎపిజిఎల్ఐ లోన్లు మరియు ఫైనల్ పేమెంట్లు,సరెండర్ లీవ్ బిల్లులు అన్నీ కలిపి సుమారు రూ.30 వేలకోట్ల బకాయిలు నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయని, సీపీఎస్ రద్దు హామీ వంటి ప్రధాన అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. తక్షణమే ఉద్యోగులు ఆర్థిక బకాయిలు చెల్లించి,30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ పథకం అమలు ప్రక్రియ సక్రమంగా అమలుకు నోచుకోకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు వైద్యఖర్చులకోసం తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు.కావున అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యందు ఈ పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పాఠశాలల యందలి వంట ఏజన్సీలకు చెల్లించే గౌరవవేతనాలు,వంట ఛార్జీలు పెంచి,విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందేలా నాణ్యమైన సన్నరకం బియ్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రకౌన్సిలర్ చంద్రహాసరెడ్డి,సీనియర్ నాయకులు బాలరాజు,కస్తూరి శ్రీనివాసులు, జిల్లాకార్యవర్గసభ్యులు పుల్లారెడ్డి, గురయ్య,వెంకటరామయ్య,రాజగోపాల్ రెడ్డి, జి.శ్రీనివాసులు,అబ్దుల్ ఉసేన్, మండలశాఖల ప్రధానబాధ్యులు రవీంద్రబాబు, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, బి.శ్రీనివాసులు,కార్యవర్గసభ్యులు పిచ్చయ్య,పీర్ భాష,కె.గురయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 26 దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలి

## - ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా



ప్రజాభూమి, వేంపల్లె

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో నవంబరు 26 న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కడపలో కళాక్షేత్రం నుంచి ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ధర్నాకు పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో కరపత్రాలను ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బల్లారపు రామాంజనేయులు మరియు ఏఐటీయూసి జిల్లా నాయకులు పి. సుబ్బరాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాల ముందు మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోరికను మోడీ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం 600 చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని, తదితర డిమాండ్లను నెరవేర్చాలని నవంబర్ 26 కడపలో కళాక్షేత్రం నుంచి ఆర్డిఓ కార్యాలయం వద్ద జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు.

# కబడ్డీ జట్టుకు ఎంపిక హర్షణీయం

## - క్రీడాకారిణికీ ఎమ్మెల్సీ ట్రాక్ షూట్ బహూకరణ- ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని వి.మానస కబడ్డీ జట్టుకు ఎంపికపై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వరసగా రెండోసారి విశ్వవిద్యాలయం మహిళల కబడ్డీ జట్టులో స్థానం సాధించింది. ఈనెల 28,29 తేదీల్లో తమిళనాడు అలగప్ప విశ్వవిద్యాలయం జరిగే దక్షిణ భారతదేశ విశ్వవిద్యాలయ మహిళా కబడ్డీ పోటీల్లో యోగి వేమన విశ్వవిద్యాలయ కబడ్డీ జట్టు తరుపున పాల్గొన్ననుంది. విద్యార్థిని మానస తండ్రి బేల్దారి పనిచేస్తూ చదివిస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కబడ్డీ ఆటకు అవసరమైన ట్రాక్ షూట్ నీ విద్యార్థినికీ అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రానించి తల్లిదండ్రుల కళలను సాకారం చేయాలని, అందుకు ఏ సహాయ సహకారాలకైన సిద్ధంగా ఉంటానన్నారు. అలాగే కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీకి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు, అధ్యాపకులు గంగాధర్, అరవింద్, ఫిజికల్ డ్కెరెక్టర్ తేజేంద్ర లు విద్యార్థినినీ అభినందించారు.

# విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి

## ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి




ప్రజాభూమి పులివెందుల టౌన్

పులివెందుల పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (అహోబిలపురం మెయిన్) నందు సార్డ్స (సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ) మరియు గ్రామాలయ సంయుక్త ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్ట్ లో భాగంగా విద్యార్థులకు హ్యాండ్ వాష్ మీద చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతీ రోజూ భోజనానికి ముందు, టాయిలెట్ కి తర్వాత సబ్బుతో చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలి తెలిపారు. చేతులు శుభ్ర పరచే ఏడు రకాల విధానాలు గురించి తెలియసేశారు. చిత్రలేఖనంలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి బి ఎస్ ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో మంచు విష్ణు జన్మదిన వేడుకలు..!





ప్రజా భూమి.చంద్రగిరి:

ఏ.రంగంపేట, మోహన్ బాబువిశ్వవిద్యాలయంలో శనివారం మంచు విష్ణు జన్మదినాన్నిపురస్కరించుకొని అధ్యాపకులు,విద్యార్థులుపుట్టినరోజువేడుకలను కేకులు కట్ చేసి,ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొ. వోస్ట్ ఆచార్య నాగరాజు రామరావ్, వైస్ ఛాన్సలర్ ఆచార్య కరుణాకరన్, రిజిస్ట్రార్ డా? కె. సారధి, ఫైనాన్స్ ఆఫీసర్ బి. రవిశేఖర్, మరియు డీన్ లు, డిప్యూటీ రిజిస్ట్రార్ లు ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు బోధనేతర సిబ్బంది పాల్గొని మోహన్ బాబు విశ్వవిద్యాలయం ప్రొ.ఛాన్సలర్ మంచు విష్ణు గురించిముచ్చటించుకున్నారు. అనంతరంసీనియర్ అధ్యాపకులు మాట్లాడుతూ మంచు విష్ణు ఇక్కడే చదువుకున్నారని, అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడని, ఏదైనా విషయాన్ని కూలంకషంగా గ్రహించే వాడని, అందుకే వ్యాపారవేత్తగా, విద్యా వేత్తగా రాణిస్తున్నాడని తెలియజేశారు. విద్యార్థులందరూ అతనిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# ఉపయోగపడే సంస్కరణలకే ప్రాధాన్యం




ప్రజాభూమి, రామచంద్రపురం

విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతూ క్రమశిక్షణతో ఉందాలని, ఉపయోగపడే సంస్కరణలకే చరిత్రలో ప్రాధాన్యం లభిస్తుందని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, కడప విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రఘుమూర్తి పేర్కొన్నారు. 63 వ జాతీయ పార్మసీ వారోత్సవాల సందర్భంగా రామచంద్రపురం మండలం వెంకట్రామపురం వద్ద ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేది నుంచి 23 వరకు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ ఫార్మసి కళాశాల ప్రాంగణంలో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వి. రఘుమూర్తి మరియు గౌరవ అతిథిగా సీనియర్ డేటా కన్సల్టెంట్ గురు తిలక్ హాజరై జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురు తిలక్ మాట్లాడుతూ కష్టపడే మనస్తత్వం అలవరుచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కణశాల ప్రిన్సిపాల్ యం. సిరంజన్ బాబు మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించామని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందచేసారు, అలానే సెమిస్టర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సహ కాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాణశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ లావణ్య వైదికర్, వివిధ విభాగాధిపతులు, బోధన సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# పైడిపల్లిఅరుంధతి వాడస్మశాన వాటిక రోడ్డు సమస్య పరిష్కారం..!





ప్రజా భూమి, చంద్రగిరి:

నియోజకవర్గంపరిధిలోని తిరుపతి రూరల్ మండలం, సి. మల్లవరం పంచాయతీ సత్తార్ బైలు, పైడిపల్లి, ఇరు గ్రామాల సరిహద్దులో పైడిపల్లి అరుంధతి వాడకి చెందిన ప్రజలు స్మశానానికి వెళ్లే దారి సమస్యలపై స్థానిక ప్రజలుఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయనసానుకూలంగా స్పందించి స్మశాన వాటిక దారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం మల్లవరం టిడిపి పంచాయతీ ఇంచార్జ్ మనోహర్ చౌదరి, టిడిపి నాయకులు భాను, స్థానిక నాయకుల సహకారంతో స్మశాన వాటికకు వెళ్లే దారి సమస్యను పరిష్కరించారు. పైడిపల్లి వద్ద నుండి స్మశాన వాటిక వరకు 15 అడుగుల రోడ్డును జెసిబి తో చదును చేసి రోడ్డు ఏర్పాటు చేశారు. మరి కొద్ది రోజుల్లోనే సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

# గండి క్షేత్రం లో అధిక సంఖ్యలో పోటెత్తిన భక్తులు

ప్రజాభూమి, వేంపల్లె

కార్తీక మాసం సందర్భంగా గండిక్షేత్రం లోని శ్రీ వీరాంజనేయ స్వామి ని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. శనివారం కావడంతో ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు ఆలయ అధికారులు పూర్తి చేశారు. కడప జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి, సతీమణి రాధమ్మ , కుమారుడు సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి, కోడలు అనిత , మనువరాలితో కలిసి కుటుంబ సమేతంగా గండి క్షేత్రం లోని వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జయరామిరెడ్డి మాట్లాడుతూ కార్తీకమాసం ను భక్తులు ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారని, ఈ కార్తీక మాసంలో భక్తులు భక్తి, శ్రద్ధలతో పలు దేవాలయాలకు చేరుకుని దేవ, దేవతలను దర్శించుకుంటారని అన్నారు. గండిక్షేత్రం ఆలయం ఎంతో పవిత్రమైనదని, గండి ఆంజనేయ స్వామి ని దర్శించుకుంటే మనసు ప్రశాంతత చెంది మనో ధైర్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు.



# ఆదానీ ను వెంటనే అరెస్ట్ చేయాలి

## సిపిఎం డిమాండ్




ప్రజాభూమి,బుట్టాయగూడెం.

భారీ ఎత్తున అక్రమాలకు, అవినీతికి పాల్పడిన అదాని ను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ బుట్టాయగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం బుట్టాయిగూడెం సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యుడు పోలోజు నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం బుట్టాయిగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యుడు అందుగుల ఫ్రాన్సిస్. తామ ముత్యాలమ్మ మాట్లాడుతూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన ఆదాని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విద్యుత్తు, మరియు అన్ని రకాల ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2019-20మధ్య సెకితో చేసుకున్న ఒప్పందమే కాక రాష్ట్ర పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంటు, విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టులకు ఆదాని గ్రూప్ సంస్థ నాటి ప్రభుత్వ ఒప్పందం చేసుకుందని, ఈ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులకు ప్రజలకు సంబంధంలేకుండా చేస్తుందని పేర్కొన్నారు.

**సిపిఎం పార్టీ జిల్లా 26వ మహాసభలు జయప్రదం చేయండి.**

డిసెంబర్ నెల 13 14 15వ తేదీన బుట్టాయిగూడెంలో జరిగే జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలోని ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజలంతా ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు చంద్రు బుల్లెమ్మ. పడకం శ్రీదేవి. తాటి రాంబాబు. పోడియం భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై జరుగుతున్న నేరాల అదుపుకు అభయ మహిళా భద్రత



ప్రజాభూమి,బుట్టాయగూడెం

సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలను అదుపు చేసే ముఖ్య ఉద్దేశంతో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.ప్రతాప్ శివ కిషోర్ అభయ మహిళా రక్షక్ ప్రవేశపెట్టినట్లు స్థానిక ఎస్సై దుర్గా మహేశ్వర రావు తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జిలుగుమిల్లి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుట్టాయిగూడెం ఎస్ఐ దుర్గ మహేశ్వరరావు అభయ మహిళా రక్షక్ కార్యక్రమంపై శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుర్గా మహేశ్వరరావు మాట్లాడుతూ మహిళలపై జరుగు నేరాలను, నేరగాళ్లను అదుపులోనికి తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశంతో అభయ మహిళా రక్షక్ ను జిల్లా ఎస్పీ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళా పోలీస్ సిబ్బందితో అభయ బీట్ లను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ఆపద సమయంలో సహాయము కొరకు 112 నెంబర్ కు ఫోను ద్వారా సమాచారం అందించిన పది నిమిషాలలో పోలీసులు భద్రతను ఏర్పాటు చేస్తారని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బాల్య వివాహాలకు ఎవరైనా పూనుకుంటే వెను వెంటనే 1098 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 కి సమాచారం అందించిన వెంటనే సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. అనంతరం మహిళా చట్టాలు, మహిళలకు సహాయాన్ని అందించుట కొరకు ప్రభుత్వం వారి ద్వారా ఏర్పాటు చేయబడిన టోల్ ఫ్రీ నెంబర్ లు గల వాల్ పోస్టర్లను విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కొరకు ప్రదర్శించారు.

# క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు

ప్రజా భూమి, కామవరపుకోట

ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రావికంపాడు నందు మండలస్థాయిలో "భారత రాజ్యాంగం బి ఆర్ అంబేద్కర్ " అనే అంశం పై జరిగిన క్విజ్ పోటీలో 78 మంది విద్యార్థులు, కామవరపుకోట, ఆడమిల్లి రావికంపాడు, యడవల్లి కు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు మాట్లాడుతూ పోటీ పరీక్షలు జీవితంలో ఎంతగానో ఉపయోగపడతాయి హైస్కూల్ స్థాయినుండి ఈ విధమైన పరీక్షలు యందు పాల్గొనాలని విద్యార్థులకు ఆశీస్సులు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రాథమితీయ స్థానాలతో పాటు వివిధ బహుమతులు అందజేస్తున్నట్లు అని చెప్పారు.



ప్రజాభూమి


## పంటకు బీమా చేయండి, రక్షణ కవచం పొందండి
## బీమా కరపత్రాలు ఆవిష్కరణ

**ప్రజా భూమి ఒంటిమిట్ట:**



సిద్ధవటం మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల పంటలకు బీమా చేయించి రక్షణ కవచం పొందాలని కరపత్రాలు ఆవిష్కరించారు ఈ సందర్భంగా అగ్రికల్చర్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు శనివారం మాట్లాడుతూ పంటల బీమా పథకం, ప్రధానమంత్రి,ఫసల్ బీమా యోజన ఆంధ్రప్రదేశ్ మరియు భారత ప్రభుత్వం, ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుపరిచిందని పంటల బీమా పథకం ముఖ్య ఉద్దేశం,తుఫానులు, కరువు అకాల వర్షాలు,వంటి,ప్రకృతి వైఫరీత్యాల వల్లపంట దిగుబడి,నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడం,వాతావరణఅంశాల, ఆధారముగా,సంభవించిన పంట నష్టం అంచనా వేసి బీమా పరిహారం అందించడం,ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో, సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులని,తెలియజేశారుఈ కార్యక్రమంలో అగ్రికల్చర్, ఏవో రమేష్ రెడ్డి, రైతు సేవ సహాయకులు,తదితర సిబ్బంది పాల్గొన్నారు

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత
### మండల ఎస్సై చిరంజీవి

**ప్రజా భూమి ఒంటిమిట్ట:**



సిద్ధవటం మండలంలోని పెన్నా నది పరివాహక ప్రాంతాల నుండి ప్రతినిత్యం బద్వేలుకు ఇసుక తరలిస్తూ అక్రమ ఇసుక దందా వ్యవహారం గుట్టు రట్టయింది. సిద్దవటంలోని గాండ్లపాలెం, పెన్నా నది నుండి బద్వేలుకు ఇసుక తరలిస్తుండగా రాబడిన సమాచారం మేరకు శనివారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు సిద్దవటం పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ అక్రమంగా ఇసుక ట్రాక్టర్ల ద్వారా బద్వేల్ తరలిస్తుండగా రెండు వాహనాలను సీజ్ చేశామని మండల తహసిల్దార్ కు వాహనాలు అప్ప చెప్తామన్నారు. గృహ నిర్మాణాలకు మాత్రమే ఉచితంగా ఇసుక రవాణా చేయాలని దూర ప్రాంతాలకు ఇసుక రవాణా చేయకూడదని ఎస్సై తెలియజేశారు.

## వ్యాసరచన పోటీల్లో స్నేహితకీ ప్రథమ బహుమతి
### - సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

**ప్రజాభూమి, వేంపల్లె**



భగవాన్ శ్రీసత్యసాయి బాబా జన్మదినాన్ని పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక శ్రీషిర్డీసాయి ఆలయంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కె.స్నేహిత ఆంగ్లభాష వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం సాధించింది. దీంతో సేవా సమితి కన్వీనర్ కె.సాయినాథ్, కన్వీనర్ పి.గోవర్ధన్ చేతుల మీదుగా విధ్యార్థినికీ బహుమతి ప్రదానం చేశారు. అలాగే మండల వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె.సాయినాథ్ మాట్లాడుతూ భగవాన్ శ్రీసత్యసాయి బాబా 99వ జన్మదిన సందర్భంగా విధ్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. అనంతరం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశామన్నారు. నగర సంకీర్తన, సామూహిక సత్యసాయి వ్రతాలను భక్తులు పాటించారని, దాదాపు 400 మంది భక్తులకు నారాయణ సేవ జరిగిందన్నారు.

## బిజెపి కూటమి విజయంతో సంబరాలు

**ప్రజా భూమి ఒంటిమిట్ట:**



మహారాష్ట్రలో బిజెపి కూటమి తిరుగులేని విజయం సాధించడంతో బిజెపి మండల అధ్యక్షుడు బాలరాజు శివరాజు ఒంటిమిట్ట బిజెపి కార్యాలయంలో శనివారం నాడు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో288 స్థానాలకు గాను 220 స్థానాలు బిజెపి కూటమి విజయం సాధించి తిరుగులేని ఆదిక్యంతో ప్రజలు ఇచ్చిన తీర్పును ఘనంగా స్వాగతిస్తూ విజయాన్ని పురస్కరించుకొని స్థానిక కార్యకర్తలతో స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు బిజెపి నాయకులు ఆనందం వ్యక్తం చేయడం జరిగినది ఈ సందర్భంగా ఒంటిమిట్ట బిజెపి మండల శాఖ అధ్యక్షుడు బాలరాజు శివరాజ్ మాట్లాడుతూ మహారాష్ట్రలో అఖండ మెజారిటీతో గెలిచిన మహారాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పాటూరు గంగిరెడ్డి.భాను ప్రకాష్ రాజు. శ్రీ ప్రతాప్ రెడ్డి మహమ్మద్ షబ్బీర్ అలీ.హిమగిరినాథ్ రామయ్య బోడెయ్య.జోహార్ సింగ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష ఏర్పాటు

**ప్రజాభూమి పులివెందుల టౌన్**



పులివెందుల పట్టణంలోని మిట్ట మల్లేశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి భక్తులకు శనివారం మధ్యాహ్నం చింతకుంట మహేశ్వర్ రెడ్డి భిక్ష ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా చింతకుంట మహేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఆలయ చైర్మన్ ఒనిడ సుబ్బారెడ్డి స్వామి దుశాలవాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు భిక్ష ఏర్పాటు చేయడం తనకు దేవుడిచ్చిన వరం అన్నారు. ఆ దేవుని దయవల్ల ప్రతి ఏటా అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ వెంకటసుబ్బయ్య, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత
### సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి

**ప్రజాభూమి, పులివెందుల**



రాష్ట్రంలోని పేదలందరి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని మండలి శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొన్నారు శనివారం ఆయన నివాసంలో పులివెందుల నియోజకవర్గంలో 6 మందికి రూ.11.15 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు లను రాంగోపాల్ రెడ్డి చేతుల మీదుగా బాధితులకు పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేద ప్రజల సహాయార్థం సీఎం చంద్రబాబు నాయుడు సహృదయంతో బాధి తుల కోసం సహాయ నిధిని విడుదల చేయడ%శీ% ఆనందదాయకమన్నారు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పరిధిలోకి రాని వైద్య సేవలు పొందిన పేదలకు అండగా నిలిచేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంబల్లి గ్రామానికి చెందిన ఇసుకపల్లి వర్షిని రెడ్డి కు .8,34,000 రూపాయలు, బూచుపల్లి గ్రామానికి చెందిన మార్తల లక్ష్మీదేవి కు రూ1,00,000, అగ దూరు గ్రామానికి చెందిన సారెడ్డి గంగిరెడ్డి కు రూ 62,038, సుంకేసుల గ్రామానికి చెందిన క్రిష్టిపాటి శ్వేతా కు రూ 60,000,ఉలిమెళ్ళ గ్రామానికి చెందిన కుంచపు వెంకట శివకు రూ 52,809 మిద్దె రాధాకు 7000 రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు కాగా లబ్ధిదారులకు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చెక్కులను అందచేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ని సత్కరించిన సాంఘిక సహాయ సంక్షేమ అధికారులు

**ప్రజాభూమి, పులివెందుల**



ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశాలలో పులివెందుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ల మరమ్మత్తులు, వాటి బాగోగుల కోసం ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఆయన చొరవతో సాంఘిక సంక్షేమ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మరమ్మతులకు కోటి రూపాయలు కేటాయించినం దున పులివెందుల నియోజకవర్గం సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వసతి గృహ సంక్షేమ అధికారులు పి రామంజులు, జి ప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలసి దు దుశ్శాలవాలతో, పూలహారం తో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్. గణేష్ బాబు , ఎస్. వెంకట రవీంద్ర , ఎస్. ప్రభాకర్ , సి. విక్టర్ ఎల్. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో ప్రతి ఏడాది 5000 మందికి అన్నదానం చేస్తున్న రామ్ దిన్

**ప్రజాభూమి,పులివెందుల**




అన్న దానానికి మించిన సేవ మరొకటి ఏది లేదు అని హిందూ సాహితీ శాస్త్రాలు చెబుతున్నాయి. అన్నదానం చేసిన వారిపై దేవుడి కృపా కటాక్షము లు వుంటాయి అని మన పూర్వీకులు చెబు తుంటారు. అన్నదాత సుఖీభవ అని మన పెద్దలు ఆశీర్వదిస్తూ వుంటారు. ఏడాదికి ఒకసారి వేల మందికి అన్నదానం చేస్తూ తన సేవ దాతృత్వాన్ని చాటు కుంటున్న అన్నదాత రామ్ దిన్. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని భారీ ఘాట్ బస్తీ కి చెందిన రామ్ దిన్ వ్యాపార రీత్యా పులివెందుల ప్రాంతాని కి వచ్చి స్థిరపడ్డారు. రామ్ దిన్ ప్రతి ఏడాది కార్తీక మాసంలో అన్నదాన కర్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఐదు వేల మందికి భోజనం అందిస్తూ వున్నారు. కార్తీక మాసంలోని నాలుగు వారాల్లో ఏదో ఒక వారం గండి క్షేత్రం లో అన్నదానం చేయడం అలవాటుగా రామ్ దిన్ మార్చుకున్నాడు. ఈ కార్తీక మాసంలో ఈ ఏడాది కూడా గండి క్షేత్రం లో శనివారం ఐదు వేల మందికి భోజనం చేయించి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అతని కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్నం బోజనాలు వడ్డించారు. ప్రతి ఏడాది అన్నదానం చేస్తున్న రామ్ దిన్ నీ గండి క్షేత్రం ఈవో వెంకటసుబ్బయ్య, చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రామ్ దిన్ బృందం పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు ఎస్సై భిక్ష ఏర్పాటు
### - భోజనాన్ని స్వయంగా వడ్డించిన ఎస్సై తిరుపాల్ నాయక్

**ప్రజాభూమి, వేంపల్లె**



అయ్యప్ప స్వాములకు వేంపల్లె ఎస్సై తిరుపాల్ నాయక్ భిక్ష ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక రంగయ్య తోటలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్ష పాటిస్తూ అనునిత్యం అయ్యప్ప నామస్మరణతో ఎంతో నియమ నిష్ఠత, భక్తి శ్రద్ధలతో మాలాధారణ ధరించిన స్వాములకు ఎస్సై తిరుపాల్ నాయక్ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అనంతరం స్వాములతో కలిసి ఆయన భోజనం చేశారు. ఎస్సై మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో కఠోర దీక్ష పాటిస్తూ అనునిత్యం అయ్యప్ప నామస్మరణతో, భక్తి శ్రద్ధలతో మాలాధారణ ధరించిన స్వాములకు భోజనాన్ని ఏర్పాటు చేయడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. అలాగే గురుస్వామి రవి మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు ఎస్సై భిక్ష ఏర్పాటు చేశారని, స్వామి కరుణ కటాక్షం ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలు కలిగిండాలని అయ్యప్ప స్వామిని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిరణ్, నజీర్, ఆనంద్, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత హెూమియో వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి
### - అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్

**ప్రజాభూమి, వేంపల్లె**

గత కొన్నేళ్లుగా ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హెూమియో వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. రేపు ఆదివారం స్థానిక శ్రీవాసవి కళ్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హెూమియో వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రముఖ హెూమియో వైద్యుడు డాక్టర్ క్రిష్ణపాటి వెంకట శేషపాణిచే ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, వేంపల్లె పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహారాష్ట్ర బీజేపీ విజయంపై వేంపల్లెలో బీజేపీ నేతల హర్షం
### - బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్



**ప్రజాభూమి, వేంపల్లె**

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలలో ఎన్డీఏ కూటమి వేంపల్లిలోని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కూటమి విజయంపై వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుండడంతో అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్రలో ప్రజలు ఎన్డీఏ కూటమికి 217 సీట్లు తో పట్టం కట్టడం హర్షనీయమన్నారు. భారతదేశాన్ని విశ్వ గురువుగా మోడీ చేస్తున్న కృషి అనితరమైందని, ఎన్డీఏ దేశ వ్యాప్తంగా చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే విజయానికి కారణమని ఆయన అన్నారు. మహారాష్ట్ర ప్రజలు ఐకమత్యం తో ఉండి కూటమికి విజయాన్ని ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, మునగల వెంకటరమణ, ప్రసాద్ రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్ కుమార్, సురేష్, చరణ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ విద్యార్థుల ప్రతిభ
### - కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి



**ప్రజాభూమి, వేంపల్లె**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతిని పురస్కరించుకుని సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మానవతా విలువల పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉషా కిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి తెలియజేశారు. ఆంగ్ల విభాగంలో పదవ తరగతికి చెందిన కె.స్నేహిత ప్రధమ బహుమతిని, ఎస్. మహిమ ద్వితీయ బహుమతిని, పి.తేజేస్ తృతీయ బహుమతిని సాధించారు. తెలుగు విభాగంలో ఎం. చందన ప్రథమ బహుమతిని , జె.పవిత్ర ద్వితీయ బహుమతిని, జి హేమ బిందు తృతీయ బహుమతిని సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఘనంగా టిడిపి సభ్యత్వ నమోదు
### - టిడిపి మండల ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇనాయతుల్లా



**ప్రజాభూమి, వేంపల్లె**

శనివారం వేంపల్లి పట్టణంలోని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇనయతుల్లా, బాల వెంకటరెడ్డి మరియు గండికోట శివ ల ఆధ్వర్యంలో స్థానిక మేదర వీధి, మెయిన్ బజార్, చైతన్య ఏరియా తదితర ప్రాంతాలల్లో ఘనంగా టిడిపి సభ్యత్వ నమోదులు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా షేక్ మహమ్మద్ ఇనయతుల్లా మాట్లాడుతూ టిడిపి సభ్యత్వానికి అపూర్వ స్పందన వస్తున్నట్లు చెప్పారు. టిడిపి సభ్యత్వం ఉన్న వారికి టిడిపి పార్టీ రూ. 5 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. ఆ కుటుంబానికి విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తుందని తెలిపారు. టిడిపి సభ్యత్వం తీసుకోవడం వలన ప్రతి కార్యకర్తకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ రెడ్డి, సాయి, భాష, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

**ప్రజాభూమి, వేంపల్లె**

శ్రీసత్యసాయి బాబా స్వామి శత జయంతి సందర్భంగా మానవతా విలువలతో కూడిన శ్రీసత్యసాయి విద్యా విధానము యొక్క విశిష్టతను తెలియజేస్తూ వ్యాసరచన పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్లభాష నందు ప్రథమ బహుమతి కె.లిఖిత, ద్వితీయ బహుమతి జీ.దీక్షిత, తృతీయ బహుమతి తనుశ్రీ సాధించారు. అలాగే తెలుగుభాషలో ప్రథమ ఎస్.పౌర్ణిమా, ద్వితీయ ఎస్.మనోజ్ కుమార్, తృతీయ ఆర్.దీక్షితరెడ్డి లు బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ పోటీల ద్వారా ఆధునిక విద్యతో పాటు మానవత విలువల ఆవశ్యకతపై విధ్యార్థుల్లో అవగాహన ఏర్పడుతుందని శ్రీచైతన్య హైస్కూల్ కరెస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి వెల్లడించారు.



ప్రజాభూమి

సత్యసాయి, అనంతపురం

## ఉపకారాగారాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

### -సౌకర్యాల పరిశీలన



ప్రజాభూమి, హిందూపురంటౌన్

పట్టణంలోని ఉప కారాగారాన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఉప కారాగారంలో ఎంత మంది ఖైదీలు ఉన్నారు, ఎప్పటినుండి ఉన్నారు, ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న విషయాలను ఉపకారాగారధికారి హనుమన్నతో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వైద్య సౌకర్యాలు, ఆహారం తదితర విషయాలను నేరుగా ఖైదీలతో ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, తప్పులు చేసి జైలుకు రావడం వల్ల గౌరవ మర్యాదలు దెబ్బతింటాయన్నారు. దీనికి తోడు ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మంచి నడవడికతో ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఇందులో భాగంగా ఉపకారాగార గదులు, వంటగది, ఉచిత న్యాయ సహాయ గది, శుద్ధ జల ప్లాంట్ తదితర వాటిని పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సిద్దు, లో క్ అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారులను గుర్తించండి

### క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పిలుపు

ప్రజాభూమి, ముదిగుబ్బ



కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ గృహకల్ప పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని తెలుగుదేశం ముదిగుబ్బ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం ముదిగుబ్బ తెలుగుదేశం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర్ గృహకల్ప కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త విజయవంతం చేయాలని కోరారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి కుటుంబానికి సంబంధించిన వివరాలను సేకరించి ప్రతి ఒక్క పేద కుటుంబానికి లబ్ధి చేకూరేలా బాధ్యతగా నిలవాలన్నారు. ఇప్పటికే నిరుపేదలు ప్రభుత్వ స్థలాలు పొందిఉన్న లేదా సొంత స్థలాలు కలిగి ఉంటే వారికి ఎన్టీఆర్ గృహకల్ప పథకంలో తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడి ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న లబ్ధిదారుల వివరాలను గుర్తించి వారికి ఎన్టీఆర్ గృహకల్ప పథకం అందేలా చూడాలని ఆయన ఈసందర్భంగా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొలసాని చంద్ర, పోడారాళ్లపల్లి వెంకటనారాయణ, అశోక్, గుర్తి నంద, రామచంద్ర, చిన్నగాని కృష్ణయ్య యాదవ్, ఏబి పల్లి కుల్లాయప్ప, చిన్న శ్రీనివాసులు, డిష్ రామాంజనేయులు, రంగనాయకులు తదితరులు ఉన్నారు.

## ఆరు బయట చెత్త పడేస్తే అపరాధ రుసుము

### మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణ సుందరీకరణ లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్తాచెదారాన్ని పడవేస్తే అపరాధ రుసుము విధించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పారిశుద్ధ్య పనుల పరిశీలనలో భాగంగా రహమత్ పురంలో కమిషనర్ పర్యటించారు. ఇందులో భాగంగా కొంతమంది తోపుడుబండ్ల వ్యాపారులు, స్థానికులు చెత్తాచెదారాన్ని ఆరుబయట, మురికి కాలువలో వేయడాన్ని గమనించిన కమిషనర్ వెను వెంటనే రూ.500 వంతున అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మొదటి తప్పుగా రూ.500 అపరాధ రుసుం విధించడం జరిగిందని, మరోసారి ఇలాగే వ్యవహరిస్తే అధిక మొత్తంలో జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రజలు, వ్యాపారస్తులు చెత్తను ఆరు బయట, మురికి కాలువలోకి వేయకుండా, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారు ఎవరికైనా జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు కమిషనర్ వివరించారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ముద్దిరెడ్డిపల్లి విద్యార్థి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి (దండురోడ్డు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గోకుల్ చరణ్ నాయక్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు సుధామణి, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్ -17 వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి ముద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి గోకుల్ చరణ్ నాయక్ ఈ నెల 6 నుండి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ లోని బరేలి లో జరిగిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు. పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్ఎం తోపాటు ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు. విద్యార్థి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు స్థానికులు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు.




## రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

**-అధికారులు కూడా రైతులకు మేలు కోసం పని చేయాలి**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ.**

ప్రజాభూమి బ్యూరో, అనంతపురము

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ పరిధిలో కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణానికి 17.97 ఎకరాల విస్తీర్ణంకు సంబంధించి డి.ఎల్.ఎన్.సి. సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ. నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ సర్వే నెంబర్ 177లో విస్తీర్ణం 9.92 ఎకరాలు మరియు సర్వే నెంబర్ 178 లో విస్తీర్ణం 8.05 ఎకరాలు మొత్తం 17.97 ఎకరాల కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణం కోసం 17 మంది రైతులు రైల్వే లైనుకు సంబంధించి వారి నుండి ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎకరాకు రూ.6.25 లక్షలు వరకు వస్తుందని, కానీ రైతులు బహిరంగ మార్కెట్లో ఎకరాకు 30 నుండి 33 లక్షల రూపాయల వరకు ఉందని, అదేవిధంగా ఇవ్వాలని కోరుచున్నారని, ఆంధ్రప్రదేశ్



ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతులకు మేలు చేసే విధంగా పనిచేస్తున్నదని , అందులో భాగంగా అధికారులు కూడా పనిచేస్తారని తెలిపారు. అదేవిధంగా బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ పరిధిలో గడిచిన ఒక సంవత్సర కాలంలో భూమి క్రయ, విక్రయాలపై పునఃపరిశీలన చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ క్రయవిక్రయాల నివేదికలు తయారుచేసి ఇవ్వాలని జిల్లా రిజిస్టర్ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ వాల్యుయేషన్ కంటే ఎక్కువగా రిజిస్టర్ చేసుకున్నటువంటి ఆధారాలతో కూడిన నివేదికలు సమర్పించాలని, గడిచిన సంవత్సర కాలంలో క్రయవిక్రయాలు నర్సాపురం గ్రామ పరిధిలో జరుపుకుండా ఉంటే సమీప చుట్టుపక్కల గ్రామాలలో క్రయవిక్రయాలు జరిపిన నివేదికలైనా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి గ్రామస్థాయిలో వీఆర్వో, తహసీల్దార్, మండల సబ్ రిజిస్టర్ క్రయ విక్రయాలపై ఆరా తీసి, పరిశీలించి నివేదికలను జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి పంపించాలని, జిల్లా రిజిస్టర్ ఆ నివేదికలను డి.ఎల్.ఎన్.సికి నివేదిక సమర్పించడం జరుగుతుందని, వారు సమర్పించిన నివేదికను డి.ఎల్.ఎన్.సి. సమావేశంలో ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు వాటిని ఆమోదం ఆమోదించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత్ బాబు, రైల్వే శాఖ ఈఈ జగదీష్ సాయి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు, తహసీల్దార్ లు, రైతులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బకాయి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి -సిడిపిఓపై అంగన్వాడీల ఫిర్యాదు

### -సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు

### -ఇంచార్జ్ పీడీకి విన్నవించిన ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

అంగన్వాడి కేంద్రాల నిర్వహణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అద్దె, గ్యాస్ బకాయిలను వెంటనే చెల్లించాలని శనివారం ఇక్కడికి విచ్చేసిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఇన్చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ వరలక్ష్మికి ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు విన్నవించారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు అరుణ, సిఐటియు పట్టణ నాయకులు వి.ఆర్.రాము మాట్లాడుతూ, అంగన్వాడి సెంటర్ లో ప్రీస్కూల్ పిల్లలకు వండుతున్న కూరగాయలు, నిత్యావసరాల బిల్లులు అందక అప్పులు చేసి వండిపెట్టి ఇబ్బంది ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్యాస్ కి సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్ లో ఉన్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు ప్రాజెక్టులో కొన్ని సెంటర్లకు పాలు తక్కువగా వస్తున్నాయని, వర్కర్లు ఈ సమస్యపై లబ్ధిదారుల వద్ద ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే సెంటర్లకు అందిస్తున్న పౌష్టికాహారం లో కూడా తేడాలున్నాయని తెలిపారు. కాగా సిడిపిఓ సెక్టర్ పరిధిలో ఉన్న ప్రతి సెంటర్ కు వెళ్లి వర్కర్ల వద్ద డబ్బులు డిమాండ్



చేస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యలపై గతంలో రెండుసార్లు పిడి కార్యాలయానికి, ఆర్.డి.ఓ, కలెక్టర్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి దృష్టికి తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమానికి వెళ్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ప్రాజెక్ట్ కోశాధికారి శశికళ, ఉపాధ్యక్షురాలు మంజుల. సహాయ కార్యదర్శి అనిత, కమిటీ సభ్యులు శైలమ్మ, జయసుధ, సుప్రజ, మాధవి, భాగ్యమ్మ, శాంతమ్మ, శివమ్మ ,భారతి, శ్రీవల్లి, అంజలి, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సాంకేతికత పరిజ్ఞానంతో ఉత్తమ భవిష్యత్తు-ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

నేటి ఆధునిక సమాజంలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో శాస్త్ర పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని సప్తగిరి ఎంబీఏ, ఎంసీఏ కళాశాల ప్రధానాచార్యులు నారాయణరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. సప్తగిరి కళాశాల లో ఎంబీఏ, ఎంసీఏ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు విద్యార్థి జీవిత గమ్యాన్ని మారుస్తాయన్నారు. ప్రతి విద్యార్థి కేవలం కోర్సులను పూర్తి చేస్తున్నారే గాని అందులోని శాస్త్ర సాంకేతిక జ్ఞానాన్ని అలవర్చుకోవడంలో వెనుకబడి ఉన్నారన్నారు. ఈ కోర్సులు అనంతరం నేరుగా ప్రతి ఒక్కరూ ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టేందుకు నిరంతర కృషి ఎంతైనా అవసరం అన్నారు. సాంకేతికతను అలవరచుకున్నప్పుడే ఉద్యోగాలకు వెళ్లేందుకు రాచబాట ఏర్పరచుకున్న వారు అవుతారన్నారు. ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో చేరినప్పటి నుండి ప్రతి విద్యార్థికి శాస్త్ర ,సాంకేతిక రంగాల్లో సంపూర్ణ అవగాహన కలిగించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సప్తగిరి ఎంబీఏ ,ఎంసీఏ కళాశాలలో చదువుకున్న అధిక సంఖ్యలో విద్యార్థులకు కోర్స్ పూర్తియిన వెంటనే ఉద్యోగాల్లో స్థిరపడడం జరుగుతోందన్నారు. దేశ, విదేశాల్లో సప్తగిరి విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసాన్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్




పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఉద్యోగావకాశాలు ఏ విధంగా కల్పించుకోవాలో విద్యార్థికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు కొన్ని వ్యాపార రంగాల్లో మెలుకువలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులను అందించడం జరిగిందని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలనాధికారి గంగిరెడ్డి, ఎంబీఏ ,ఎంసీఏ కళాశాలల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ప్రథమ ,ద్వితీయ సంవత్సరం ఎంబీఏ ,ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## వైభవంగా సత్యసాయి జన్మదిన వేడుకలు

### - కేక్ కట్ చేసిన ఎస్ఐ ఇషాక్ బాషా

ప్రజాభూమి, ముదిగుబ్బ

ముదిగుబ్బ మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం భగవాన్ శ్రీసత్యసాయి బాబా జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భగవాన్ సాయి 99వ జన్మదిన పురస్కరించుకొని ఉచిత అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగుబ్బ ఎస్సై ఇషాక్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై చేతులమీదుగా కేక్ కట్ చేసి సాయి నీటి సరఫరా కార్మికులకు ఆర్డబ్ల్యూఎస్ కార్మికులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ మానవులకు సేవ చేసేటప్పుడు భగవంతునికి సేవ చేసినట్లేనని శ్రీసత్యసాయి బాబా ఉద్ఘటించేవారన్నారు. సాయిబాబా విద్య వైద్య రంగానికి ఎనలేని సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాలకు శాశ్వత త్రాగునీటి సరఫరా అందించి అపర




భగీరతుడగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రత్యేక పైపులైన్ల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు తాకినీటి సరఫరా అందించి ప్రజల దాహార్తి తీర్చిన కలియుగ దైవమైన శ్రీసత్య సాయిబాబా అని కొనియాడారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండలంలో పనిచేస్తున్న సత్యసాయి నీటి సరఫరా కార్మికులు ఆర్డబ్ల్యూఎస్ కార్మికులు పలు గ్రామాల సాయి భజన మందిర భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## హిందూపురం అభివృద్ధిపై బాలయ్య మంతనాలు

ప్రజాభూమి, హిందూపురం

మున్సిపల్ కమిషనర్ తో ప్రత్యేక చర్చలు ఇటీవల హిందూపురం మున్సిపల్ పరిధిలోని రైల్వే రోడ్డు విస్తరణ చేపడుతుండగా ఆ విషయమై మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులతో ఎమ్మెల్యే కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకంగా చర్చించారు అదేవిధంగా హిందూపురం మున్సిపల్ పరిధిలోని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా ప్రత్యేకంగా మున్సిపల్ కమిషనర్ తో ఎమ్మెల్యే బాలకృష్ణ వివరాలు అడిగి తెలుసుకున్నారు హిందూపరాన్ని అన్ని విధాలుగా ఏరకంగా అభివృద్ధి చేయాలి ఎలాంటి పనులు చేపట్టాలి అన్న విషయాలపై ఎమ్మెల్యే కమీషనర్ తో ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అందుకు నిధులను మంజూరు చేయించేందుకు తాను ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు దీనికి తోడు మున్సిపల్ పరిధిలో ప్రధానంగా ఉన్న సమస్యలు ప్రధానంగా ఉన్న సమస్యలు ప్రత్యేకంగా నివేదిక రూపొందించి తనకు ఇస్తే అందుకు అనుగుణంగా తాను నిధులు మంజూరు చేయించేందుకు



తప్పకుండా ప్రయత్నిస్తానని బాలయ్య పేర్కొన్నారు ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మున్సిపల్ కౌన్సిలర్ డి రమేష్ తో పాటు పలువురు కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు

Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at Mohaneeswar Publications, D.No.30-251,WARDNO.4,BUDDAYAPALLY VILLAGE, CHINNACHOWK, YSRDISTRICT-516002, ANDHRAPRADESH.and Published from D.No.30-251,WARDNO.4,BUDDAYAPALLY VILLAGE, CHINNACHOWK, YSRDISTRICT-516002, ANDHRAPRADESH Editor :A.RAMAMOHANREDDY,CELL: 9502116677